సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

హైదరాబాద్
శనివారం 07.03.2026


@mudranews mudratv

సంపుటి: 13 సంచిక: 135
పేజీలు: 12 వెల: రూ. 5

హైదరాబాద్

ఓవైపు క్యూర్..
## నేచరల్ సీన్

# గ్రీన్ ఫ్యూచర్



ఓఆర్ఆర్–ఆర్ఆర్ఆర్ మధ్య 1.10 లక్షల ఎకరాల్లో భారీ గ్రీన్‌బెల్ట్
ప్రతి 3.5 కిలోమీటర్లకు ఒక హరిత జోన్ ఏర్పాటు లక్ష్యం
110 గ్రీన్ జోన్లలో ఆక్వా, అగ్రి బిజినెస్‌లకు ప్రోత్సాహం
రూ.35 వేల కోట్లతో 340 కి.మీ రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం
24 అర్బన్ క్లస్టర్లు, 208 గ్రామాలకు కనెక్టివిటీ
కాలుష్య నియంత్రణకు గ్రీన్ బెల్ట్ కీలకం అంటున్న నిపుణులు
ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు 10 రేడియల్ రోడ్ల ప్రణాళిక
బుద్వేల్, రావిర్యాల నుంచి కొత్త రహదారి మార్గాలు
ట్రాఫిక్ తగ్గింపుకు ఐటీ, పరిశ్రమలు రింగ్ రోడ్ల చుట్టూ అభివృద్ధి
చెరువులు, జలవనరులు కాపాడేందుకు గ్రోత్ కారిడార్ మాస్టర్ ప్లాన్

ముద్ర, తెలంగాణ బ్యూరో:

హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం ఓఆర్ఆర్ ఆర్ఆర్ఆర్ మధ్య 1.10 లక్షల ఎకరాల్లో భారీ గ్రీన్‌బెల్ట్‌ను ఏర్పాటు చేస్తోంది. దీనిని 110 హరిత జోన్లుగా విభజించి ఆక్వా, అగ్రి బిజినెస్‌లను ప్రోత్సహించనుంది. రూ. 35 వేల కోట్లతో నిర్మిస్తున్న 340 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డు ద్వారా 24 అర్బన్ క్లస్టర్లను అనుసంధానిస్తూ, కాలుష్య రహిత అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా.. క్యూర్.. ప్యూర్.. రేర్ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తోంది. క్యూర్ ప్యూర్ రీజియన్ల మధ్యలో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. దీని పరిధిలో అందుబాటులోకి వచ్చే లక్షా పది వేల ఎకరాల భూముల్లో చెరువులతో పాటు ఆక్వా కల్చర్, అగ్రి బిజినెస్ వంటి వ్యాపారాలను ..మిగతా 2లో



## ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్
ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా మసాబ్ ట్యాంక్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం
మహిళా సంఘాలకు రూ.35 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ
పాత ఎలక్ట్రానిక్ వస్తువులను రీసైక్లింగ్‌కు ఇవ్వాలని ప్రజలకు మంత్రి సూచన
మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది: పొన్నం ప్రభాకర్
గ్రామాలు, వార్డుల్లో 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం కొనసాగుతోంది

3




## జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు

3

ప్రింట్, ఎలక్ట్రానిక్, ఫోటో, వీడియో, డెస్క్, ఉర్దూ మీడియా జర్నలిస్టులకు సమాన హక్కులు
జీవో 252లో లోపాలపై ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన టీయూడబ్ల్యుజే (ఐజేయు)
డెస్క్ జర్నలిస్టుల అక్రిడేషన్లపై అపోహలు వద్దు.. కోతలు లేవన్న విరాహత్ అలీ
జర్నలిస్టుల హక్కులు, ఆరోగ్య సహాయం కోసం యూనియన్ ఎప్పుడూ ముందుంటుందన్న నాయకులు




## పన్ను ఎగవేతదారులపై కొరడా

మొండిబకాయిల వసూళ్లపై జీహెచ్ఎంసీ కఠిన చర్యలు
ముందుగా రెడ్ నోటీసులు ఇచ్చి వసూళ్లు
స్పందించకపోతే ఆస్తులు సీజ్
జాబితా సిద్ధం చేసిన అధికారులు
రూ. 3 వేల కోట్లలో రూ. వెయ్యి కోట్లు బకాయిలు

10




## ఇంజినీరింగ్ ఫీజులు ఖరారు..

జీవో జారీ చేసిన ప్రభుత్వం
బీటెక్ కోర్సులకు కొత్త ఫీజులు..
2027-28 వరకు అమలు
టాప్ ఇంజినీరింగ్ కాలేజీల ఫీజులు విడుదల
ట్యూషన్ ఫీజులోనే అడ్మిషన్, ప్రత్యేక ఫీజులు
ఇంజినీరింగ్ కాలేజీలకు కనీస ఫీజు రూ.45 వేలు

9



ఇరాన్ ఖతం..
## ఇక టార్గెట్ క్యూబా..

10

అంతు చూస్తామని ట్రంప్ హెచ్చరిక
ఇరాన్ నావిక దళాన్ని నాశనం చేశామని ప్రకటన
ఇరాన్ అధికారులు కాళ్లబేరానికి వచ్చారన్న అమెరికా అధ్యక్షుడు




# పంచాయతీల్లో నిధుల రగడ


గ్రామ పంచాయతీల్లో బిల్లుల వివాదం ముదురుతోంది
పెండింగ్ బిల్లులపై పాత–కొత్త సర్పంచ్‌ల మధ్య ఘర్షణ
రూ.1000 కోట్ల బకాయిలపై గ్రామాల్లో రాజకీయ పోరు
కేంద్ర నిధుల వినియోగంపై సర్పంచ్‌ల మధ్య వాదోపవాదాలు
అభివృద్ధి పనుల బిల్లులే ఇప్పుడు కొత్త తలనొప్పి
పాత పనుల బిల్లులా? కొత్త అభివృద్ధా? గ్రామాల్లో చర్చ
నిధుల కోసం పాత సర్పంచ్‌లు డిమాండ్.. కొత్తవారి ఆందోళన
గ్రామాభివృద్ధికి నిధుల కొరతపై కొత్త సర్పంచ్‌ల అసహనం
పంచాయతీల్లో పెండింగ్ బిల్లులే ప్రధాన సమస్య
పాత అప్పులు తీర్చాలా? కొత్త పనులు చేయాలా? సర్పంచ్‌ల సందిగ్ధం

ముద్ర, తెలంగాణ బ్యూరో:

రాష్ట్ర గ్రామ పంచాయతీల్లో కొత్త పంచాయితీలు నెలకొంటున్నాయి. పెండింగ్ బిల్లుల చెల్లింపులకు సంబంధించి పాత సర్పంచ్‌లు, కొత్త సర్పంచ్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంటోంది. తాము అప్పులు తెచ్చి డబ్బులు ఖర్చు పెట్టి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని.. కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చిన నిధులను పెండింగ్ బిల్లులు చెల్లింపుల కింద ఇవ్వాలని పాత సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులకే నిధులన్నీ అయితే అభివృద్ధి ఏం చేయాలంటూ కొత్త సర్పంచ్‌లు తలలు పట్టుకుంటున్నారు.

**పాతవే.. కొత్త లొల్లి**

తెలంగాణలో దాదాపు 2 ఏళ్ల ఆలస్యంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. జనవరి నెలలోనే గ్రామాల్లో కొత్త పాలక వర్గాలు ఏర్పడి.. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లతో పాలన సాగుతోంది. తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం చేయడంతో.. ..మిగతా 2లో




# తెలంగాణలో విద్యా విప్లవం

జిల్లాకు ఒక్క ప్రీస్కూల్.. కార్పొరేట్ తరహాలో నిర్మాణం
తెలంగాణలో 33 ప్రీస్కూల్స్‌కు రేవంత్ సర్కార్ గ్రీన్ సిగ్నల్
ఒక్కో ప్రీస్కూల్‌కు రూ.30 లక్షలు.. ప్రతిపాదనలు సిద్ధం
అంగన్‌వాడీల బలోపేతానికి భారీ ప్రణాళిక
తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ 2026లో భాగంగా కొత్త అడుగు
చిన్నారులకు నాణ్యమైన ప్రీప్రైమరీ విద్య లక్ష్యంగా ప్రభుత్వం
పోషకాహారం, మౌలిక సదుపాయాలతో అంగన్‌వాడీల అభివృద్ధి

ముద్ర, తెలంగాణ బ్యూరో:

తెలంగాణలోని అన్ని జిల్లాల్లో కార్పొరేట్ తరహాలో ప్రీస్కూల్స్ నిర్మించాలని రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. జిల్లాకు ఒకటి చొప్పున 33 స్కూల్స్ నిర్మించనున్న ప్రభుత్వం ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఒక్కో స్కూల్ నిర్మాణానికి రూ.30 లక్షలు వెచ్చించనున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లోని ..మిగతా 2లో

# నేను అందరివాడను




నన్ను ఎవరు ఎలా పిలిచినా పట్టించుకోను
పది మందికి సేవ చేయడానికే సీఎం అయ్యా
మహాభారతంలో కర్ణుడు, బార్బరీకుడి పాత్రలు నాకిష్టం
మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డ
రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా మాదిగల పక్కన నిలబడిన
నాపై జరుగుతోన్న దాడులకు మీ జాతి అండగా ఉండాలి
మాదిగ ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ సన్మాన కార్యక్రమంలో సీఎం రేవంత్

9



## పక్క రాష్ట్రాలకు రాష్ట్ర సంపద

### మలయాళ పత్రికల్లో రూ. వందల కోట్ల ప్రకటనలు

మాజీ మంత్రి హరీశ్ రావు నిప్పులు
కేరళ ఎన్నికల కోసం తెలంగాణ డబ్బుతో ప్రకటనల వర్షం
మలయాళ పత్రికల్లో సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలతో ఫుల్ పేజీ యాడ్స్‌పై ఆగ్రహం
రాష్ట్రంలో ఖజానా ఖాళీ అంటూనే బయట కోట్ల ఖర్చు చేస్తున్నారని ఆరోపణ
మహాలక్ష్మి, ఉద్యోగాలు, రైతు హామీలను మరిచిపోయిన కాంగ్రెస్ సర్కార్
ఇతర రాష్ట్రాల ఎన్నికలకు తెలంగాణ ఖజానాను అక్షయపాత్రలా వాడుతున్నారని విమర్శ
ప్రకటనల కోసం ఖర్చు చేసిన వందల కోట్లు తిరిగి చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్

3

# ప్రజల వద్దకే పాలన

సీఎం రేవంత్ 99 రోజుల 'ప్రజా ప్రస్థానం'!"

గ్రామాల దిశగా పాలనా యంత్రాంగం..
99 రోజుల మిషన్ ప్రారంభం
ప్రజల దగ్గరకు ప్రభుత్వం.. సమస్యల పరిష్కారానికి ఫీల్డ్‌లో అధికారులు
ఆరోగ్యం నుంచి వ్యవసాయం వరకు 10 కీలక రంగాలపై ఫోకస్
ప్రతి జిల్లాలో కలెక్టర్లకు టార్గెట్స్.. గ్రామ సభలతో ఫీడ్‌బ్యాక్ సేకరణ
100 నియోజకవర్గాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభం లక్ష్యం
జూన్ 2 నాటికి పాలనలో గుణాత్మక మార్పులే లక్ష్యం
వికసిత్ తెలంగాణ – విజన్ 2047 దిశగా రేవంత్ కార్యాచరణ

2






## సివిల్స్ లో మెరిసిన తెలుగు తేజాలు

2

19 మందికి వెయ్యి లోపు ర్యాంకులు
జశ్వంత్ చంద్ర 23, సృజనకు 55వ ర్యాంకులు
పరీక్షల్లో 958 మందికి అర్హత
అనూజ్ అగ్నిహోత్రి, రాజేశ్వరి సువే, ఆకాన్ష్ ధుల్ కు తొలి మూడు ర్యాంకులు
15 రోజుల్లోగా మార్కుల జాబితా

## ఇదీ ఏఐ ముద్ర

బీహార్ సీఎం నితీష్ కుమార్ ను జాతీయ రాజకీయాల పేరుతో సీఎం కుర్చీ నుంచి తీసేసిన బీజేపీ.. బీహార్ సీఎం సీటును బీజేపీ కైవసం చేసుకొని నితీష్ కుమార్ ను సైడ్ చేసేసింది..



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
07.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews






**బర్ముడా ట్రైయాంగిల్ రహస్యం**
అట్లాంటిక్ సముద్రంలోని ఈ ప్రాంతంలో అనేక నౌకలు, విమానాలు అదృశ్యమయ్యాయని కథలు ఉన్నాయి. ఇప్పటికీ దీనికి స్పష్టమైన శాస్త్రీయ వివరణపై చర్చలు కొనసాగుతున్నాయి.

# పంచాయతీల్లో 'నిధుల' రగడ

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచింది. ఎన్నికలు పూర్తి అయిన తర్వాత మాత్రమే వాటిని రిలీజ్ చేస్తామని తేల్చి చెప్పింది. దీంతో ఇటీవల ఎన్నికలు పూర్తై గ్రామాల్లో కొత్త సర్పంచ్‌లు వచ్చిన తర్వాత.. దశల వారీగా 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం విడుదల చేస్తోంది. అదే సమయంలో గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులను కేటాయిస్తోంది. ఇక్కడే ఇప్పుడు అసలు సమస్య మొదలైంది. పలు విడతల్లో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు సుమారు రూ. 1,034 కోట్ల నిధులను ఇటీవలె విడుదల చేసింది. ఇప్పుడు ఈ నిధుల గురించే.. కొత్త సర్పంచ్‌లు, పాత సర్పంచ్‌లకు మధ్య తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. తాము గతంలో సర్పంచ్ హోదాలో గ్రామాల్లో చేపట్టిన మౌలిక సదుపాయాలు కల్పించామని.. వైకుంఠ ధామాలు, డ్రైనేజీలు, క్రీడా ప్రాంగణాలు వంటి అభివృద్ధి పనులు చేసినట్లు పాత సర్పంచులు చెబుతున్నారు. ఆ పనులకు అప్పట్లో బిల్లులు రాకపోవడంతో తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుపోతున్నాయని పాత సర్పంచ్‌లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**మావే.. కావు మావే**

పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.1,000 కోట్లకు పైగా పాత బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం విడుదలైన నిధులపై తమకే హక్కు ఉంటుందని తేల్చి చెబుతున్నారు. ఇక.. కొత్త సర్పంచ్‌లు మాత్రం వాటికి ససేమిరా అనడంతో అసలు వివాదం మొదలైంది. తాము పంచాయతీ ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి, గ్రామాలను డెవలప్ చేస్తామని ప్రజలకు మాట ఇచ్చామని.. ఇప్పటివరకు వచ్చిన నిధులు మొత్తాన్ని పాత బకాయిలకే చెల్లిస్తే.. ఇక గ్రామాల్లో అభివృద్ధి ఎలా చేయాలంటూ ప్రశ్నిస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చీ రాగానే.. కేంద్రం నుంచి విడుదలైన నిధులను ఇవ్వకపోతే.. ఇక గ్రామ పంచాయతీలను ఎలా నడపాలంటూ ప్రశ్నిస్తున్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడం కోసం కొత్త పనులు ప్రారంభించకుండా కేవలం పెండింగ్ బకాయిలు తీర్చడానికే తాము కొత్తగా పదవుల్లోకి వచ్చామా అంటూ కొత్త సర్పంచ్‌లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**అలా అయితే కష్టమే కదా**

పెండింగ్ నిధుల్లో కేంద్రం కొంత మాత్రమే విడుదల చేయడం.. అందులో చాలా వరకు పాత బకాయిలు చెల్లించడానికే ఉపయోగించడం వల్ల.. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, స్ట్రీట్ లైట్స్ వంటి అత్యవసర పనులు చేసేందుకు కూడా నిధులు లేకుండా పోతున్నాయని కొత్త సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని.. కేంద్రం నుంచి పెండింగ్‌లో ఉన్న మిగతా నిధులను కూడా త్వరగా విడుదలయ్యేలా చూడాలని తెలంగాణ గ్రామ సర్పంచుల సంఘం విజ్ఞప్తి చేస్తోంది. నిధుల విషయంలో కొత్త, పాత సర్పంచ్‌ల విషయంలో ఈ ఉద్రిక్తత తలెత్తడంతో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించారు. గతంలో గ్రామాల్లో చేపట్టిన తాగునీరు, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను.. తాజాగా విడుదలైన నిధుల నుంచి చెల్లించాలని మంత్రి సీతక్క స్పష్టం చేసింది. అదే సమయంలో పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధుల్లో నుంచి గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని సూచించారు.

# హైదరాబాద్ గ్రీన్ ఫ్యూచర్

(మొదటి పేజీ తరువాయి)

చేయవచ్చు. ఈ భూములను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో కానీ.. ప్రైవేటు, కార్పొరేటు సంస్థలకు లీజుకివ్వడం ద్వారా గానీ గ్రీనరీని పెంపొందించి ఆర్ఆర్ఆర్ లోపల భాగంలో సకాలంలో వర్షాలు కురిసేలా చర్యలు తీసుకోనున్నారు. ఓఆర్ఆర్ చుట్టూ ప్రస్తుతం అంతగా గ్రీన్‌బెల్ట్ లేకపోవడం, ఇండ్లు, పరిశ్రమలు పెరుగుతుండడంతో కాలుష్యం పెరుగుతుందని చెబుతున్నారు. ఓఆర్ఆర్ ఆర్ఆర్ఆర్ మధ్యలో గ్రీన్‌బెల్ట్ వల్ల ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య 110 ప్రాంతాలను హరిత జోన్లుగా ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రీన్‌బెల్ట్‌కు కేటాయించనున్న 1.10లక్షల ఎకరాలను 110 గ్రీన్‌జోన్లుగా విభజించనున్నారు. ఇలా విభజిస్తే.. ప్రతి 3.5 కిలోమీటర్లకు ఒక హరిత జోన్ ఏర్పాటు కానుంది. ఇందులో ఆక్వా, అగ్రి బిజినెస్, చెట్లతో ప్రతి జోన్ ప్రాణవాయువు కేంద్రంగా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇక రీజినల్ రింగు రోడ్డును రూ. 35 వేల కోట్ల వ్యయంతో 340 కిలో మీటర్ల మేర నిర్మిస్తున్నారు. 24 అర్బన్ క్లస్టర్లు, 208 గ్రామాలను కనెక్ట్ చేస్తున్నారు. దక్షిణ తెలంగాణ పరిధిలో 182 కి.మీ గ్రీన్‌ఫీల్డ్ రింగ్‌రోడ్డు ప్రధాన రహదారిగా మారనుంది. ఔటర్ రింగు రోడ్డుతో పాటు చౌటుప్పల్, శివన్నగూడ, కందుకూరు, ఆమనగల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, సంగారెడ్డి మీదుగా వెళ్లనుంది. ఉత్తర తెలంగాణ పరిధిలో 158 కి. మీ మేర ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. గజ్వేల్, సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, యాదాద్రి, ప్రజ్ఞాపూర్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వద్ద ఈ రోడ్డు కలుస్తుంది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి.

**ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు**

హైదరాబాద్ నగర భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని హెచ్ఎండీఏ సరికొత్త మాస్టర్‌ప్లాన్‌ను రెడీ చేస్తోంది. హైదరాబాద్ ఫ్యూచర్ అంతా ఓఆర్ఆర్, రీజినల్ రింగ్ రోడ్ మధ్యే కేంద్రీకృతం కానుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రావిర్యాల, బుద్వేల్ వంటి ప్రాంతాల నుంచి 10 రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులతో తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగు రోడ్డు వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు చేపడుతోంది. రానున్న రోజుల్లో భవిష్యత్తు అంతా ఓఆర్ఆర్.. ఆర్ఆర్ఆర్ చుట్టూ కేంద్రీకృతం కానుండటంతో అందుకనుగుణంగా ప్రణాళికలకు రూపొందిస్తోంది. ప్రస్తుతం ఔటర్ రింగు రోడ్డు నుంచి ఆర్ఆర్ఆర్ వరకు 10 రేడియల్ రోడ్ల నిర్మాణానికి హెచ్ఎండీఏ ప్రణాళికలు రెడీ చేసింది. ప్రస్తుతం ఓఆర్ఆర్ రావిర్యాల ఇంటర్ ఛేంజ్ నుంచి ఆమనగల్ వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డును నిర్మిస్తున్నారు. ఇప్పటికే తొలి దశ పనులు ప్రారంభయ్యాయి.



**అంతేకాదు...**

ఇదే కాకుండా బుద్వేల్ లేఅవుట్ నుంచి ఔటర్ రింగు రోడ్డు మీదుగా కోస్గి వరకు మరో రేడియల్ రోడ్డుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. బుద్వేల్ వద్ద దాదాపు రూ.400 కోట్లతో భారీ ఇంటర్‌ఛేంజ్, ట్రంపెట్ రోడ్డును నిర్మిస్తున్నారు. రాజేంద్రనగర్ వైపు నుంచి వచ్చే వాహనాలు ఎయిర్‌పోర్టుతోపాటు ఇతర ప్రాంతాలకు సులువుగా రాకపోకలు సాగించేలా ఈ రోడ్డును తీర్చిదిద్దుతున్నారు. రానున్న మూడేళ్లలో 3 నుంచి 4 రేడియల్ రోడ్ల నిర్మాణానికి డీపీఆర్ సైతం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో 80 లక్షల వాహనాలు రోడ్లపై పరుగులు పెడుతున్నాయి. ఐటీ కారిడార్‌లో వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్‌కు చెక్ పెట్టేలా ఔటర్, ఆర్ఆర్ఆర్ చుట్టూ పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, లాజిస్టిక్ హబ్‌లు ఇతరత్రా అన్ని రకాల కార్యకలాపాలు ఒకేచోట కేంద్రీకృతం అయ్యేలా ఇప్పటి నుంచే హెచ్ఎండీఏ ప్రణాళికలను సిద్ధం చేసింది.

**గ్రోత్ కారిడారు**

హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డుకు అటు, ఇటు కిలోమీటర్ మేర గ్రోత్ కారిడార్‌గా పేర్కొంటున్నారు. అందులో భూ వినియోగ మార్పిడి, నిర్మాణాలు చేపట్టాలంటే హెచ్ఎండీఏ నుంచి పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. చెరువులు, వాగులు, జలవనరులు, అక్కడ ఉన్న గ్రీనరీని కాపాడేందుకు ఈ మాస్టర్‌ప్లాన్ ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. అడ్డగోలుగా రెడ్, ఎల్లో కేటగిరి పరిశ్రమలు రాకుండా వాటికి ప్రత్యేక ప్రాంతాలను కేటాయించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో బస్సులు, ఎంఎంటీఎస్, మెట్రో వంటి ప్రాజెక్టుతో వాటితో అనుసంధానం చేయనున్నారు.

# సివిల్స్ లో మెరిసిన తెలుగు తేజాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ (మెయిన్) 2025 తుది ఫలితాలు విడుదలయ్యాయి. యూపీఎస్సీ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈ పరీక్షలో మొత్తం 958 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. వీరిలో జనరల్ కేటగిరీ నుంచి 317 మంది ఉండగా.. ఈడబ్ల్యూఎస్ నుంచి 104, ఓబీసీ నుంచి 306, ఎస్సీ కేటగిరీ నుంచి 158, ఎస్టీ కేటగిరీ నుంచి 73 మంది చొప్పున ఉన్నట్లు యూపీఎస్సీ ప్రకటించింది. ఈ ఫలితాల్లో అనూజ్ అగ్నిహోత్రి, రాజేశ్వరి సువే, ఆకాన్ష ధుల్ తొలి మూడు ర్యాంకులతో సత్తా చాటగా.. పలువురు తెలుగు విద్యార్థులు సివిల్స్‌లో మెరిశారు.

**సివిల్స్ లో మెరిసిన తెలుగు తేజాలు :**

సివిల్స్ ఫలితాల్లో పలువురు తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. జశ్వంత్ చంద్ర 23వ ర్యాంకుతో మెరవగా.. సృజన 55వ ర్యాంకు, భానోత్ లక్ష్మీ రచన 178, డీఎస్‌కే ప్రచేత్ 193, ఎస్ వర్షిత్ రెడ్డి 259, ఎం.పవన్‌కుమార్ రెడ్డి 297, వెలిమినేటి విక్రమసింహారెడ్డి 541, గుమ్మల శ్వేత 573, పల్లి ప్రమోద్ విష్ణు 640, గుమ్మల విజయసింహారెడ్డి 682, పోతుపురెడ్డి భార్గవ్ 738, పుడారి రాహుల్ 748, కుమ్మరి శ్రవణ్‌కుమార్ 768, అనిరుధ్ కత్తిమాని 786, కోరపోతుల శ్రీకర్‌రాజు 806, ఇస్లావత్ శ్రీరామ్ హర్ష 823, కట్టా ప్రత్యూష 908, గోగుల రాజశేఖర్ 920, గుగులోతు జితేందర్ నాయక్ 939వ ర్యాంకులతో తమ విశేష ప్రతిభను చాటారు.




**సత్తా చాటిన టాప్ 20 ర్యాంకర్లు..**

అనూజ్ అగ్నిహోత్రి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించగా రాజేశ్వరి సువే, ఆకాన్ష ధూల్, రాఘవ్ ఝుంఝున్వాలా, ఇషాన్ భట్నగర్, జిన్నియా అరోరా, ఏ ఆర్ రాజా మొహైదీన్, పక్షాల్ సెక్రటరీ, ఆస్తా జైన్, ఉజ్వల్ ప్రియాంక్, యశస్వి రాజ్ వర్ధన్, అక్షిత్ భరద్వాజ, అనన్య శర్మ, సురభి యాదవ్, సిమ్రన్‌దీప్ కౌర్, మోనికా శ్రీవాస్తవ, చిత్వాన్ జైన్, శృతి ఆర్, నిసార్ దిశంత్ అమృతాల్, రవి రాజ్, రాజేశ్వరి సువే, అకాన్ష ధుల్, రాఘవ్ ఝున్‌ఝున్‌వాలా, ఇషాన్ భట్నాగర్, జినియా అరోడా, ఏఆర్ రజా మొహియిద్దీన్, పక్షల్ సెక్రటరీ అస్థా జైన్, ఉజ్వల్ ప్రియాంక్ వరుసగా 20 ర్యాంకులు సాధించారు.

**15 రోజుల్లోగా మార్కుల జాబితా**

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) సహా పలు సర్వీసుల్లో పోస్టుల భర్తీకి యూపీఎస్సీ ఏటా సివిల్స్ పరీక్ష నిర్వహిస్తున్నది. ఈ ఎంపిక ప్రక్రియ ప్రిలిమినరీ, మెయిన్, ఇంటర్వ్యూ అనే మూడు దశల్లో జరుగుతుంది. గతేడాది సివిల్స్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. మే 25న జరిగిన ప్రిలిమ్స్‌లో సత్తా చాటిన వారికి 2025 ఆగస్టు 22 నుంచి 31 వరకు మెయిన్ పరీక్ష నిర్వహించారు. మెయిన్ పరీక్షలో అసాధారణ ప్రతిభను కనబరిచిన వారికి డిసెంబర్ నుంచి 2026 ఫిబ్రవరి వరకు దశల వారీగా ఇంటర్వ్యూలను నిర్వహించి తాజాగా తుది ఫలితాలను ప్రకటించారు. ఈ పరీక్ష/నియామకాలకు సంబంధించి ఏదైనా సమాచారం లేదా స్పష్టత కోసం ఫెసిలిటేషన్ కౌంటర్ ఏర్పాటు చేశారు. పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వయంగా వెళ్లి గానీ లేదా 23385271/23381125/23098543 నంబర్ల ద్వారా సంప్రదించవచ్చని యూపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షల్లో అభ్యర్థులు సాధించిన మార్కులను 15 రోజుల్లోపు తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని పేర్కొంది.

# ప్రజల వద్దకే పాలన

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

పాలనా యంత్రాంగం మొత్తం గ్రామాలకు వెళ్లనుంది. కార్యాలయాలకు ప్రజలు రావడం కాదు.. ప్రజల దగ్గరకు ప్రభుత్వం రానుంది. సొంత సమస్యలతో పాటు భూ సమస్యలపై అందరి ముందే చర్చించనున్నారు. మార్చి 6 నుంచి 99 రోజుల పాటు యంత్రాంగం అంతా ప్రజల్లోనే ఉండేలా సీఎం రేవంత్ సన్నాహాలు చేస్తున్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో మొత్తం మార్చేయాలనుకుంటున్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో వేగం పెంచేందుకు, సంక్షేమ ఫలాలను నేరుగా ప్రజల ముంగిట ఉంచేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 99 రోజుల కార్యాచరణను ప్రకటించింది. మార్చి 6, 2026 నుంచి ప్రారంభమై జూన్ 12 వరకు ఈ 99 రోజుల కాలాన్ని 10 ప్రధాన అంశాలుగా విభజించి, ఐదు దశల్లో అమలు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, మహిళా సాధికారత, పారిశుద్ధ్యం, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, రోడ్డు భద్రత , సంక్షేమం, యువత,క్రీడలు, డ్రగ్స్ రహిత సమాజం వంటి కీలక రంగాలు ఉన్నాయి. ప్రతి రంగానికి నిర్దిష్ట గడువును విధిస్తూ, పాలనలో జవాబుదారీతనాన్ని పెంచడం ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశం.

**క్షేత్రస్థాయి పాలన - కలెక్టర్లకు టార్గెట్స్**

ఈ కార్యక్రమం ద్వారా కేవలం సచివాలయానికే పరిమితం కాకుండా, యంత్రాంగం మొత్తాన్ని క్షేత్రస్థాయికి నడిపించాలని సీఎం లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా కలెక్టర్లు ప్రతి నెలా కనీసం 10 రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, గ్రామ సభల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలపై లబ్ధిదారుల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ సేకరించాలని ఆదేశించారు. కలెక్టర్ల పనితీరుకు ఈ 99 రోజుల కార్యాచరణ ఒక బెంచ్‌మార్క్ గా నిలుస్తుందని సీఎం నమ్మకంతో ఉన్నారు.

**టెక్నాలజీతో పారదర్శకత**

సంక్షేమ పథకాల అమలులో అక్రమాలను అరికట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను జోడిస్తోంది. లబ్ధిదారుల గుర్తింపు కోసం ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థను ప్రవేశపెడుతున్నారు. అలాగే, సేవలను ఆన్‌లైన్ ద్వారా ఇంటి వద్దకే చేరవేసేలా ఈగవర్నెన్స్ సంస్కరణలు చేపడుతున్నారు. పాత సర్వర్లను అప్‌డేట్ చేసి, రాబోయే 20 ఏళ్లకు సరిపడా డిజిటల్ డేటా వ్యవస్థను సిద్ధం చేయాలని సీఎం ఆదేశించడం ఆయన దూరదృష్టికి నిదర్శనం.

**విద్య, వైద్య వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు**

ప్రభుత్వ ఆసుపత్రులను సమీపంలోని మెడికల్ కాలేజీలతో అనుసంధానం చేయడం ద్వారా సాధారణ ప్రజలకు కూడా నిపుణులైన వైద్యుల సేవలు అందేలా చేయడం ఈ ప్రణాళికలో మరో ముఖ్య అంశం. విద్యా రంగంలో 100 నియోజకవర్గాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించి, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. స్కూళ్లలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు పెండింగ్ బిల్లులు లేకుండా చేయడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు.

**వికసిత్ తెలంగాణ - విజన్ 2047**

సీఎం రేవంత్ రెడ్డి ఈ 99 రోజుల కార్యాచరణను కేవలం స్వల్పకాలిక పథకంగా కాకుండా, తెలంగాణ రైజింగ్ విజన్ 2047 దిశగా ఒక మైలురాయిగా చూస్తున్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి పాలనలో గుణాత్మక మార్పులు తీసుకువచ్చి, తెలంగాణను దేశానికే ఒక మోడల్‌గా నిలపాలన్నది ఆయన ప్రధాన లక్ష్యం. పరిశ్రమల స్థాపనలో, సేవారంగంలో రాష్ట్రాన్ని అగ్రపథాన ఉంచడం ద్వారా భవిష్యత్ తరాలకు బలమైన ఆర్థిక పునాది వేయాలని ఆయన ఆశిస్తున్నారు. ఈ 99 రోజుల ప్రణాళిక రేవంత్ రెడ్డి రాజకీయ పరిపక్వతకు, పాలనా దక్షతకు ఒక పరీక్షగా నిలవనుంది. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రజలకు సేవలను వేగంగా చేరవేయడంలో ఈ కార్యక్రమం ఎంతవరకు సఫలమవుతుందో చూడాలి.

# తెలంగాణలో విద్యా విప్లవం

(మొదటి పేజీ తరువాయి)

చిన్నారులు, బాలికలు, గర్భిణులు, బాలింతల కోసం తెలంగాణ పోషణ పథం కింద ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. తెలంగాణలో విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు రేవంత్ ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు చేపట్టింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ 2026' ద్వారా నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఉచిత, నాణ్యమైన విద్యను అందించటమే లక్ష్యంగా కార్యక్రమాలు రూపొందించింది. ప్రతి నియోజకవర్గంలో కార్పొరేట్ స్థాయిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమైంది. విద్యార్థులకు ఉచిత బ్రేక్‌ఫాస్ట్, స్కూల్ కిట్స్ వంటి మౌలిక వసతుల కల్పనపై సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. ఇక కార్పొరేట్ తరహాలో ప్రీప్రైమరీ స్కూళ్లను నిర్మించాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. తొలి విడతలో జిల్లాకు ఒకటి చొప్పున మొత్తం 33 స్కూళ్లను నిర్మించనుంది. ఒక్కొక్క స్కూలుకు రూ.30 లక్షలు ఖర్చు చేయనుంది. ఈ మేరకు ఇప్పటికే శిశు సంక్షేమశాఖ ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 11,616 అంగన్‌వాడీల్లో మౌలిక సదుపాయాలు సైతం సమకూర్చనుంది. అందుకు ఒక్కో కేంద్రానికి రూ.2 లక్షలు ఖర్చు చేయనుంది. ఇదే కాకుండా ఆరోగ్య లక్ష్మి పథకంలో భాగంగా తెలంగాణ పోషణ పథం పేరిట అంగన్వాడీల్లోని చిన్నారులు, బాలికలు, గర్భిణులు, బాలింతల కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించనుంది. 1418 ఏళ్ల మధ్య వయసున్న కౌమార బాలికల్లో పోషకాహారలోపం, రక్తహీనత నివారించేందుకు ఏడాదిలో 100 రోజుల ప్రణాళిక అమలు చేయనుంది. ప్రత్యేక న్యూట్రిషియన్ ప్యాకేజీ కింద వారికి మల్టీమిల్లెట్ చిక్కీ, ఇన్‌స్టంట్ మిక్స్, ఉప్మా, కిచిడీ అందిస్తారు. ప్రీస్కూల్ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, బెల్ట్, బూట్లు, సాక్సులు అందించనున్నారు. ఏడాదికి 300 రోజులు 100 మి.లీ పాలు, 25 గ్రాముల అల్పాహారం అంగన్‌వాడీ కేంద్రంలోనే ఇవ్వనున్నారు. బాలామృతం, బాలామృతం ప్లస్ ఫార్ములేషన్‌లో మరిన్ని మైక్రో న్యూట్రియెంట్లు ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అంగన్‌వాడీలులేని పట్టణ, మురికి వాడల్లో రూ.4 కోట్లతో 274 మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అద్దె భవనాల్లోని అంగన్‌వాడీలకు శాశ్వత భవనాలతో పాటు జిల్లాల్లో 70 శిశు సంక్షేమ ప్రాజెక్టులకు కార్యాలయాలు నిర్మించనున్నారు. ప్రీప్రైమరీ టీచర్లకు ఇంటర్‌తో పాటు రెండేళ్ల డిప్లొమా అర్హతగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ టీచర్లకు నూతన విద్యావిధానం కింద సర్టిఫికేషన్ కోర్సులు ప్రవేశపెట్టేందుకు సర్కార్ సిద్ధమైంది.




సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
07.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### ఈజిప్ట్ పిరమిడ్ల నిర్మాణ రహస్యం

వేల సంవత్సరాల క్రితం భారీ రాళ్లతో పిరమిడ్లు ఎలా నిర్మించారో పూర్తిగా తెలియదు. అప్పటి సాంకేతికతతో ఇది ఎలా సాధ్యమైందో అనేది పెద్ద ప్రశ్న.






## జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు

- **టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

అర్హత ఉన్న ప్రతి జర్నలిస్ట్ కు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని టీయు డబ్ల్యూ జే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, ఫోటో, వీడియో,డెస్క్ జర్నలిస్టు, ఉర్దూ మీడియా విభాగాల్లో వర్కింగ్ జర్నలిస్టుల అందరికీ అక్రిడేషన్ కార్డు లు మంజూరు చేయాలన్నారు. జీవో 252 లో లోపాలు ఉన్న కారణంగానే యూనియన్ తరపున ముందుగానే ప్రభుత్వం, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, ఇప్పటికే కొన్ని సవరణలు చేసినట్లు ఆయన తెలిపారు. డెస్క్ జర్నలిస్టులకు అక్రిడేషన్ల కేటాయింపులో కోత పెడుతున్నారనే అపోహలు ఉండవద్దన్నారు. ఇప్పటికే ఐ అండ్ పి ఆర్ కమిషనర్ తో పాటు సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇటీవల డెస్కు జర్నలిస్టులు చేసిన నిరసన కార్యక్రమాలకు టీయూడబ్ల్యుజే మద్దతు ప్రకటించిందన్నారు. టియుడబ్ల్యూజే ఆరున్నర దశాబ్దాలకు పైగా జర్నలిస్టుల పక్షపాతిగా వ్యవహరిస్తున్నదని, ఏ ప్రభుత్వానికి,పార్టీకి కొమ్ముకాయదని విరాహత్ అలీ స్పష్టం చేశారు. మండల విలేకరులకు అక్రిడేషన్ కార్డులు అందుతాయన్నారు.

రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ మాట్లాడుతూ... ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో యూనియన్ బలోపేతానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలన్నారు.వర్కింగ్ జర్నలిస్టుల అందరికీ అక్రిడేషన్ కార్డుల విషయంలోనే కాకుండా ఆరోగ్యం విషయంలోనూ యూనియన్ నుంచి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో యూనియన్ మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాటం నాగరాజుగౌడ్, ఎన్. సతీష్ కుమార్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ అహ్మద్ పాషా, జిల్లా కోశాధికారి జిల్లెల రఘు ఆయా పత్రికల, చానళ్ళ జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

## పక్క రాష్ట్రాలకు రాష్ట్ర సంపద

- **మలయాళ పత్రికల్లో రూ. వందల కోట్ల ప్రకటనలు**
- **సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలతో ఫుల్ పేజీ యాడ్స్**
- **మాజీ మంత్రి హరీశ్ రావు**



**ముద్ర, హైదరాబాద్ :**

తెలంగాణలో ఉన్న సంపదను కాంగ్రెస్ ప్రభుత్వం పక్క రాష్ట్రాల ఎన్నికల ప్రచారానికి విచ్చలవిడిగా మళ్లిస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. కేరళలో జరుగుతున్న ఎన్నికల కోసం అక్కడి మలయాళ పత్రికల్లో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎంల ఫోటోలతో రూ. వందల కోట్లు ఖర్చు చేసి ఫుల్ పేజీ ప్రకటనలు ఇవ్వడాన్ని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇంట్లో ఈగల మోత.. వీధిలో పల్లకి మోత" అన్నట్లుగా రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని కల్లబొల్లి మాటలు చెబుతున్న ప్రభుత్వం, పొరుగు రాష్ట్రాల్లో మాత్రం తెలంగాణ ప్రజాధనాన్ని మంచినీళ్లలా పారబోస్తోందని ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని మహిళలు, యువతను కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా వంచించిందని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ. 2500, తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలు అమలు చేయకుండా ఇక్కడి ఆడబిడ్డల కంట్లో మట్టి కొట్టారని ఆరోపించారు. కానీ కేరళలో మాత్రం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేశామంటూ పచ్చి అబద్ధాలతో దొంగ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు ఇస్తామన్న ఉద్యోగాల ఊసే లేదని, నోటిఫికేషన్ల కోసం రోడ్డెక్కిన విద్యార్థులపై అర్ధరాత్రులు లాఠీలతో విరుచుకుపడుతున్నారని ఈ సందర్భంగా హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగం, సామాజిక పింఛన్ల విషయంలోనూ ప్రభుత్వం మాట తప్పిందని హరీశ్ రావు దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో పండుగలా సాగిన రైతుబంధును ఆపేసి, రుణమాఫీ పేరుతో సగానికి పైగా రైతులను నట్టేట ముంచారని మండిపడ్డారు. రైతు భరోసా, వరికి రూ. 500 బోనస్ వంటి హామీలు గాలికొదిలేశారని విమర్శించారు. ఎన్నికల ముందు రూ. 4వేల పెన్షన్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు వృద్ధులను, వికలాంగులను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ సంక్షేమ పథకాలకు నిధులు లేవని చెప్పే రేవంత్ రెడ్డికి, కేరళలో అబద్ధపు ప్రకటనలు ఇవ్వడానికి చేతులెలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రజాధనం దోపిడీ కేవలం కేరళకే పరిమితం కాలేదన్నారు. మహారాష్ట్ర, ఢిల్లీ వంటి ఇతర రాష్ట్రాల ఎన్నికలకు తెలంగాణ ఖజానాను కాంగ్రెస్ పార్టీ అక్షయ పాత్రలా వాడుకుంటోందని హరీశ్ రావు ఆరోపించారు. ఇతర రాష్ట్రాల ప్రజలు కాంగ్రెస్ 'ఫేక్ పబ్లిసిటీ' ట్రాప్‌లో పడొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. తక్షణమే ఈ దొంగ ప్రచారాలను ఆపాలని, ప్రకటనల కోసం ఖర్చు చేసిన వందల కోట్ల రూపాయలను కాంగ్రెస్ పార్టీ ఖాతా నుంచే ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో మార్పు రావాలి

- **99 రోజుల కార్యాచరణతో సత్ఫలితాలు సాధించాలి**
- **రెవెన్యూ - అటవీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**
- **ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




**ముద్ర, ఖమ్మం :**

ప్రజలకు మేలైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.... క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో గతంలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణాల్లో చోటుచేసుకున్న లోపాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో సరైన లెవల్స్ లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేకంగా సమావేశమై, ఎక్కడైతే నీరు ఆగుతుందో ఆ ప్రాంతాలను గుర్తించి తక్షణమే సరిచేయాలని ఆదేశించారు. అవసరమైతే లోపభూయిష్టమైన నిర్మాణాలను తొలగించి, కొత్తగా నిర్మించాలని సూచించారు. ఏ అధికారి హయాంలో ఈ పొరపాట్లు జరిగాయో రికార్డుల్లో నమోదు చేసి, వారిని బాధ్యులను చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్లకు స్పష్టం చేశారు.

అటవీ రెవెన్యూ సరిహద్దు వివాదాలకు ముగింపు ఉమ్మడి జిల్లాలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న అటవీ, రెవెన్యూ భూముల వివాదాలను పరిష్కరించేందుకు ఈ 99 రోజుల ప్రణాళికను వేదికగా చేసుకోవాలని మంత్రి సూచించారు. కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లెందు, వైరా వంటి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. కలెక్టర్లు, డి.ఎఫ్.ఓలు మరియు రెవెన్యూ యంత్రాంగం ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సరిహద్దులను ఖరారు చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా నూటికి నూరు శాతం పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ..**

**నిధుల వినియోగం**

కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, మేయర్లు మరియు చైర్మన్లకు పాలనాపరమైన అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఈ నెల 12న ఉమ్మడి జిల్లా స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. అనుభవజ్ఞులైన అధికారులతో ఈ శిక్షణ ఇప్పించడం ద్వారా, గ్రామాల్లో నిధుల వినియోగంపై వారికి స్పష్టత వస్తుందన్నారు. ముఖ్యంగా గత రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న పంచాయతీ నిధులు ఇప్పుడు విడుదలవుతున్నాయని, వాటిని గ్రామాభివృద్ధికి పారదర్శక పద్ధతిలో ఖర్చు చేసేలా విలేజ్ సెక్రటరీలతో కలిసి పని చేయాలని సూచించారు.

**సాగు పద్ధతుల్లో మార్పు.. రైతుల్లో చైతన్యం**

వ్యవసాయ రంగంలో రైతులు విచక్షణారహితంగా వాడుతున్న ఎరువులు, పురుగుమందుల ప్రభావం భూసారంపై పడుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రైతుకూ భూసార పరీక్షలు, పంట మార్పిడి విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అధికారులే నేరుగా రైతుల వద్దకు వెళ్లి ఆధునిక సాంకేతికతను వివరించాలని, అవసరమైతే ఇతర ప్రాంతాల్లోని ఆదర్శ సాగు పద్ధతులను పరిశీలించేందుకు ప్రభుత్వ ఖర్చుతో రైతులకు క్షేత్ర పర్యటనలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.

### పార్టీలకు అతీతంగా ప్రజా సేవ

ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉన్నా, గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులందరూ ప్రజల కోసమే పని చేయాలని మంత్రి ఉద్ఘాటించారు. ఈ అభివృద్ధి ప్రణాళికలో అధికార, ప్రతిపక్ష పార్టీలనే భేదం లేకుండా అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అధికారులు మరింత శ్రద్ధ వహించి ప్రభుత్వ ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, చైర్మన్లు పాల్గొన్నారు.





## ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

- **హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్**
- **లైబ్రరీ, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, ఈ - వ్యర్థాల సేకరణ కేంద్రం ప్రారంభం.**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్య తెలంగాణ, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, హైదరాబాద్ ఇన్ ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ జిల్లా మసాబ్ ట్యాంక్ లోని చాచా నెహ్రూ పార్క్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలను రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ లతో కలసి నూతన లైబ్రరీ, ఇందిరా అమ్మాయిల శక్తి క్యాంటీన్, అలాగే ఈ వ్యర్థాల సేకరణ కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. ఇందులో భాగంగా మహిళా సంఘాలకు రూ. 35 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కును అందించారు. మహిళా సంఘాల సభ్యులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 12 వేల గ్రామాల్లో, వార్డుల్లో ,మున్సిపాలిటీల్లో ప్రజా పాలన..ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో కొనసాగుతుందని అన్నారు. మన ఇళ్లలో ఉండే పాత టీవీ లు ,పాత ఫ్రిడ్జిలు , కంప్యూటర్ ,ల్యాప్ టాప్ లు పాడైపోయిన వాటిని అక్కడే ఉంచడంతో ఎలాంటి ఉపయోగం ఉండదన్న పొన్నం.. ఆ వస్తువులను ఈ .. వ్యర్థాల సేకరణ సెంటర్ కి తెచ్చి రీసైక్లింగ్ అందించాలని సూచించారు. ఇక్కడ 15 వందల చదరపు గజాల స్థలంలో ఏర్పాటు చేసుకున్న లైబ్రరీ స్థానిక ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందనీ పుస్తకాలు డొనేట్ చేయడానికి ప్రత్యేక సెంటర్ ఏర్పాటు పొలాల్లో చేయటం అభినందనీయం అన్నారు. పట్టణంలో మహిళా సంఘాల సభ్యుల సంఖ్య తక్కువ ఉందని.. ప్రతి మహిళలు ఎక్కువగా సంఘంలో చేరాలని సూచించారు. మహిళల సంక్షేమానికి ఎన్ని కార్యక్రమాలు చేపట్టిందని, ఉచిత బస్సు ప్రయాణం ఒక చరిత్ర సృష్టించిందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్,సన్న బియ్యం,రేషన్ కార్డులు మహిళల పేరు మీద ఇస్తున్నామనీ మంత్రి సందర్భంగా గుర్తు చేశారు. ఐకేపీ,మహిళా సంఘాల తరుపున బస్సులు ఆర్టీసీ లో నడుస్తున్నాయన్నారు. బస్సులకు మహిళలను యజమానులను చేశామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న వడ్డీ లేని రుణాలు పొంది ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో మహిళలు కీలక పాత్ర పోషిస్తూ చురుకుగా పాల్గొనాలని అన్నారు. విద్యా ,వైద్యం ,పర్యావరణ పరిరక్షణ , పరిసరాల పరి శుభ్రత ఇలా అన్ని స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు చేపట్టనున్న కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

## సమన్వయంతో సక్సెస్ చేయండి

**ముద్ర, హైదరాబాద్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు హైదరాబాద్ జిల్లాలో 99 రోజుల కార్యాచరణను నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కారం, ఆరోగ్యం, భద్రత, సంక్షేమం, పిల్లల రక్షణ, డ్రగ్స్ నివారణ, విద్య, యువత-క్రీడలు, మహిళలు, పర్యావరణం వంటి పది ప్రధాన అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని వివరించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని ఆయన సూచించారు. ఫిర్యాదులు అందితే వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, పోలీస్ కమిషనర్ సజ్జనార్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, ఎస్ పి డి సి ఎల్ ఎండి జితేష్ పాటిల్, జోనల్ కమిషనర్ ప్రియాంక అలా, డిసిపి శిల్పవల్లి, అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, డిఆర్ఓ వెంకటాచారి, ఆర్డీవోలు రామకృష్ణ సాయిరాం, జిల్లా అధికారులు, తాహసిల్దార్లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట

- **శాశన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఎంతగానో ఉపయోగపడుతుందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన వివిధ శాఖల అధికారులకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పి.మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు నారాయణ రెడ్డి, మను చౌదరి, దీపక్ తివారి, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్లు వినయ్ కుమార్ రెడ్డి, సృజన ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు మంచి పేరు వస్తుందని ఆయన. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు జవాబుదారి తనంతో పని చేయాలన్నారు.

జిల్లా ఇన్చార్జి ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 99 రోజుల పాటు చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో జవాబుదారీ తనంతో ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తెలిపారు. 99 రోజుల పాటు చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ అందని వారిని గుర్తించి నిర్లక్ష్యం వహించకుండా అమలు కాని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ 99 రోజుల పాటు చేపట్టే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో 10 అంశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రజల వద్దకే అధికారులు వస్తున్నారన్నారు. ఇప్పటికీ రేషన్ కార్డులు, ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇండ్లను కేటాయించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన తెలిపారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 హామీలను నెరవేర్చే దిశగా పని చేస్తామన్నారు. జిల్లాలోని 4 నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతగిరి ఈకో పార్క్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. హౌసింగ్ ద్వారా ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి ఎప్పటికప్పుడు చెల్లింపులు అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో నీటి కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని 106 గురుకుల పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా, మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యమైన భోజనాన్ని అందించే దిశగా పనిచేస్తామని తెలిపారు. ఈ అవగాహన సమావేశంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, శంకరయ్య, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డితో పాటు వివిధ శాఖల చైర్మన్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 07.03.2026
www.mudranews.in | @mudranews



### స్టోన్‌హెంజ్ రహస్యం



ఇంగ్లాండ్‌లో ఉన్న ఈ భారీ రాళ్ల వలయం ఎందుకు నిర్మించారో స్పష్టంగా తెలియదు. ఇది ఖగోళ పరిశోధనకోసం లేదా ఆధ్యాత్మిక కారణాల కోసం అని భావిస్తున్నారు.

# పాలమూరును ప్రగతి పథంలో నడిపిస్తా

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :** మహబూబ్ నగర్ పట్టణాన్ని వచ్చే ఐదేళ్లలో ప్రగతి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబ్ నగర్లోని 31వ డివిజన్ గణేష్ నగర్‌లో నిర్వహించిన ప్రజాపాలన,ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమం వివరాలను అధికారులకు, ప్రజలకు వివరించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 99 రోజుల పాటు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. మహబూబ్ నగర్ లోని 60 డివిజన్లలో అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి తమపై నమ్మకం ఉంచారన్నారు. ప్రజలు ఇచ్చిన విశ్వాసాన్ని నిలబెట్టుకునే బాధ్యత తమపై ఉందని, అందుకే నగర అభివృద్ధి పనులకు త్వరలోనే శంకుస్థాపనలు చేస్తామన్నారు. పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రూ.220 కోట్లు మంజూరు చేశారన్నార . అలాగే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కోసం రూ.603 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. త్వరలో ప్రతి డివిజన్ అభివృద్ధి పనుల కోసం రూ.50 లక్షలు అందించనున్నట్లు వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. గణేష్ నగర్‌లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ మేయర్ గుమ్మాల మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి, కార్పొరేటర్లు వెన్నెల రఘు, శ్రీపూజి, తిరుమల వెంకటేష్, రమేష్ రెడ్డి, కిషన్ నాయక్, రమేష్, ఈశ్వరయ్య, యాదగిరి, శ్రీను నాయక్, తాహేర్, మేగ్యా నాయక్, మైత్రి యాదయ్య, రఘు, అక్బర్, శ్రావణ్ కుమార్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి**

జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే ఇప్పటి నుంచే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేయాలని పదవ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే సూచించారు. శుక్రవారం మహబూబ్ నగర్ పరిధిలోని ఎదిరలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ముడా నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను, హైమాస్ట్ విద్యుత్ దీపాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం బాగుంటేనే వారు చదువులో కూడా మెరుగైన ఫలితాలు సాధించగలరని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే ఎగ్జామ్ కిట్లు అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని, క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు సాధించడం సులభమన్నారు. విద్యార్థులపై వారి తల్లిదండ్రులు ఎంతో నమ్మకం ఉంచుకున్నారని, వారి భవిష్యత్తు బాగుండాలని ఎంతో కష్టపడుతున్నారని గుర్తు చేశారు. తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చే విధంగా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉన్నత విద్యలో ముందుకు సాగాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. విద్యార్థులు చదువులో ప్రతిభ చూపించి ఐఐటీ, ఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో సీట్లు సాధించేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగిన ఉదాహరణలు ఉన్నాయని, కష్టపడి చదివితే ఏ లక్ష్యాన్ని ఐనా సాధించగలరని ఆయన అన్నారు. అంతకుముందు ఎదిర గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించి నూతన గృహ ప్రవేశం చేసిన లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పేదలకు గృహ సదుపాయం కల్పించడం జరుగుతోందని, ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ మేయర్ గుమాల మమత శ, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ బి. లలిత భానుచందర్, నాయకులు మైత్రి యాదయ్య, హన్మంతు, రాములు బచ్చన్న, శ్రీశైలం, శ్రీనివాసులు, చంద్రకాంత్, అంజి, ఎల్లయ్య, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. శ్రీకాంత్, ఆర్సీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కార్యసిద్ధిని కలిగించే దైవం శ్రీలక్ష్మీ గణపతి

● బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్



**ముద్ర, కుత్బుల్లాపూర్:** జీహెచ్ఎంసీ కొంపల్లి సర్కిల్ పరిధి జయభేరి కాలనీ నల్ల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్వహించనున్న శ్రీ లక్ష్మీ గణపతి, కాశీ విశ్వనాథ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేపట్టిన ప్రతి పనిలో విజయం చేకూర్చే దైవం వినాయకుడని, లక్ష్మీ గణపతి స్వామి కృపా కటాక్షాలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆదిరెడ్డి రవీందర్ రెడ్డి, సభ్యులు రామ్మోహన్, నరసింహ, నరేందర్ రెడ్డి, మహబూబ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మనోజ్ కుమార్, విశ్వనాథ శర్మ, ఆదిరెడ్డి రాజిరెడ్డి, ఓబి రాజు, గోపాల్ రెడ్డి, మల్లారెడ్డి, జి రాజిరెడ్డి, సంజీవరెడ్డి, సదానందం, విలాస్ కుమార్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## కొత్త కలెక్టర్ ను కలిసిన ఎమ్మెల్యే, మేయర్



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :** మహబూబ్ నగర్ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ఖుష్బు గుప్తా ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మేయర్ మమత శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, బొకేతో సత్కరించారు. కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో కలిసి జిల్లా అభివృద్ధి లో భాగం పంచుకోవాలని వారు కోరారు. ఈ జిల్లా లో ఉన్న సమస్య లను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే నేతల సమన్వయం తో పరిష్కారించే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. అందరి సహకారం తో జిల్లా అభివృద్ధి కోసం పాటుపడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



**ముద్ర, మల్కాజిగిరి:** మేడ్చల్ నియోజకవర్గం పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఎన్ టీ కాలనీలో శ్రీభూ నీళా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి నూతన ఆలయ విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిగిరి ప్రజలు సుఖశాంతులతో ఉండాలని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



**ముద్ర, తాండూర్:** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తాండూర్ మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని 12వ వార్డులో జిమ్ పార్క్ వద్ద క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనము ఆరోగ్యంగా ఉండగలమన్నారు. కావున ప్రతి ఒక్కరూ తాండూర్ పట్టణాన్ని సుందరంగా ఉంచడంలో అందరూ భాగస్వాములు కావాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్లు ఉమేష్, వెంకటయ్య, టౌన్ ప్లానింగ్, వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యాయునిగా మారిన జిల్లా కలెక్టర్



**ముద్ర, వనపర్తి :** వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు క్లాసులు బోధించారు. పదో తరగతి విద్యార్థులకు పైథాగరస్ సిద్ధాంతాన్ని సులభతరంగా ఎలా చేయాలో వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ గురుకులాల్లో సీటు కొరకు పోటీ అధికంగా ఉందని, అటువంటి అవకాశం సాధించిన విద్యార్థులు బాగా చదువుకొని పదో తరగతి బోర్డు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. పాఠశాలలోని వంటగదిని పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు వండే ఆహారాన్ని తప్పనిసరిగా గ్యాస్ స్టౌవ్ పై మాత్రమే వండాలని సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ఆహారం విద్యార్థులకు వడ్డించే ముందు సూపర్వైజర్ తప్పనిసరిగా రుచి చూసి తర్వాతనే అందించాలన్నారు. అనంతరం ఆహార పదార్థాల నిల్వ గదిని పరిశీలించి, మెస్ కమిటీ పనిచేస్తుందా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, పాఠశాలకు సరఫరా అయ్యే ఆహార పదార్థాలను దిగుమతి చేసినప్పుడు మెస్ కమిటీ విద్యార్థులు తప్పనిసరిగా సంతకం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య నివేదికలను పరిశీలించి, ఆరోగ్యం పై సూచనలు చేశారు. తర్వాత పదో తరగతి విద్యార్థుల గదిని సందర్శించి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. రాబోయే బోర్డు పరీక్షల నేపథ్యంలో అందరూ కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి, సరైన సమాధానాలు చెప్పిన వారికి నోట్‌బుక్స్‌ను అందజేసి ప్రోత్సహించారు. డీఎంహెచ్వో డాక్టర్ సాయినాథ్ రెడ్డి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ పరిమళ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, ఎంఈఓ పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా, 5వ థీమ్ అయిన పిల్లల భద్రత డ్రగ్స్ నిర్మూలనపై వికారాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగం విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలను చైతన్యపరిచారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని 4 గ్రామాల చొప్పున, జిల్లా వ్యాప్తంగా మొత్తం 80 గ్రామాలలో ఈ అవగాహన సదస్సులు నిర్వహించబడ్డాయి. పరిగి సబ్ డివిజన్‌లోని కొడంగల్ పట్టణంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ముఖ్య అతిథిగా హాజరై భారీ 2కె రన్‌ను ప్రారంభించారు. అనంతరం పరిగి నియోజకవర్గ పరిధిలోని మాదారం గ్రామంలో ఈగల్ టీమ్ డైరెక్టర్‌తో కలిసి ఎస్పీ నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువత డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, విద్యార్థులు "గుడ్ టచ్ – బ్యాడ్ టచ్" పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. అలాగే వివిధ గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలోఅనేక కార్యక్రమాలు చేపట్టారు.

## ఈవీఎంలు భద్రం



**ముద్ర, వనపర్తి:** జిల్లా కేంద్రంలోని ఈవీఎంలు భద్రపరిచిన గోదాము కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాములోని ఈవీఎం లను త్రైమాసిక తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లపై సిబ్బందిని అడిగి తెల్సుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదాం తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే శుక్రవారం గోదాంలోని ఈవీఎంలను త్రైమాసిక తనిఖీ చేసినట్లు చెప్పారు. అనంతరం గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, రెవెన్యూ అధికారులు చక్రపాణి, సీ సెక్షన్ సిబ్బంది రాజేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి నుంచి లక్ష్మయ్య, శంకర్, కాంగ్రెస్ నుంచి వేనా చారి, సిపిఎం నుంచి పరమేశ్వర్ చారి, బీజేపీ నుంచి కుమారస్వామి, ఆంజనేయులు, బీ ఆర్ ఎస్ నుంచి గట్టు యాదవ్, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ప్రధానిగా రాహుల్ గాంధీని చేయడమే లక్ష్యం



**ముద్ర, వనపర్తి :** భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీని చేసేంతవరకు విశ్రమించకూడదని, ప్రతి ఒక్కరం సంఘటితంగా పనిచేసి క్షేత్రస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేన రెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 9 నుంచి 16 వరకు బూత్ స్థాయి కమిటీ, వార్డ్ కమిటీ, గ్రామ కమిటీ, మండల కమిటీ, పట్టణ కమిటీల ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం బూతు అధ్యక్షుడిని నియమిస్తుందని, ఓటు హక్కు ఉన్న బూతులోనే అక్కడి నాయకుడు బూతు అధ్యక్షుడిగా వ్యవహరిస్తాడని తెలిపారు. వీటితోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, ఎన్ఎస్ యూఐ, మహిళా విభాగాలు కూడా ఎన్నుకోబడుతాయని వారు తెలిపారు. పార్టీ కోసం పనిచేసే వారికి సముచిత స్థానం లభిస్తుందని ఎవరు కూడా నిరాశ చెందకుండా పనిచేయాలని వారు సూచించారు. మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎస్పీ డా. వినీత్



**ముద్ర, నారాయణపేట:** పురుషులతో సమానంగా మహిళలు రాణించాలని ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని శీలా గార్డెన్‌లో ఒఎంఐఎఫ్(ఆపరేషన్ మెస్సి ఇండియా ఫౌండేషన్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ సమాజంలో అందరికీ సమాన హక్కులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఎదగాలని సూచించారు. మహిళలు ఉన్నతంగా ఎదగాలంటే చదువు అత్యంత ముఖ్యమని, ప్రతి మహిళ చదువుకుంటే వారి కుటుంబం మాత్రమే కాకుండా తరతరాల భవిష్యత్ కూడా మెరుగుపడుతుందని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పినట్లుగా ప్రతి ఇంట్లో ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందన్నారు. కాగా జోగిని వ్యవస్థ నుంచి విముక్తి పొందిన మహిళలు వారి కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు లేని అనాథ విద్యార్థులకు స్వయం ఉపాధి కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 సెంటర్లలో కుట్టు మిషన్, బ్యూటీ పార్లర్ ట్రైనింగ్ పొందిన సుమారు 300 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. 30 మంది ఒకేషనల్ కోర్స్ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

## పర్యావరణాన్ని కాపాడేలా డంపింగ్ యార్డ్‌ను నిర్వహించాలి

-జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** పర్యావరణాన్ని కాపాడుతూ డంపింగ్ యార్డును నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణ పరిధి గంగారంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించి మాట్లాడారు. వ్యర్థాల నిర్వహణ విధానం, శుభ్రత, వ్యర్థాల వర్గీకరణ పారిశుధ్య చర్యలపై అధికారులతో మాట్లాడారు. డంపింగ్ యార్డ్‌లో చెత్తను సక్రమంగా వర్గీకరించి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని సూచించారు. చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి రీసైక్లింగ్ చర్యలను వేగవంతం చేయాలన్నారు. డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో శుభ్రతను కచ్చితంగా పాటించాలని, దుర్వాసన, కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలో 28 వ వార్డ్ ను సందర్శించి వార్డ్ సమస్యలపై ఆరా తీశారు. ప్రతి ఇంటికి చెత్త వాహనం తిరిగి వంద శాతం తడి, పొడి చెత్త సేకరణ జరగాలని, వాహనానికి జియో ట్యాగింగ్, సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, వైస్ చైర్మన్ అర్ద సుధాకర్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి బస్తీ బాట

ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పరమేశ్వర్ రెడ్డి



**ముద్ర, కాప్రా:** సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బస్తీబాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలోని కాలనీలలో బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం మల్లాపూర్ ఉమ్మడి డివిజన్, శక్తిసాయి నగర్ డివిజన్లలోని బ్రహ్మపురి కాలనీ, చండియా నగర్, తదితర కాలనీలలో పర్యటించి నేరుగా ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తాగునీరు, డ్రెయినేజీ, స్ట్రీట్ లైట్లు వంటి మౌలిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలతో పాటు డ్రెయినేజీ, రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ ,మాజీ కార్పొరేటర్ సింగి రెడ్డి ధన్ పాల్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీతారామ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 07.03.2026
www.mudranews.in | @mudranews



**లోక్ నెస్ మాన్ స్టర్ కథ**

స్కాట్లాండ్‌లోని లోక్ నెస్ సరస్సులో ఒక భారీ జీవి ఉందని చాలామంది చెబుతారు. కానీ దీనికి ఖచ్చితమైన ఆధారాలు లభించలేదు.



# కరీంనగర్ ను అగ్రభాగాన నిలుపుదాం

**- ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక విజయవంతం చేద్దాం**

**- మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**




**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతి పథంలో తీసుకెళ్లి అగ్ర భాగాన నిలుపుతామని ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పెద్దపెల్లి ఎంపీ, ఉమ్మడి జిల్లా పరిధిలోని కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు, అడిషనల్ కలెక్టర్లు, అన్ని శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజులపాటు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు కలిసి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఒకవైపు సంక్షేమాన్ని, మరోవైపు అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం పరుగులు పెట్టిస్తున్నదని తెలిపారు. రెండున్నర సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలందరికీ వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని పేర్కొన్నారు.

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఇరిగేషన్, ఆర్ అండ్ బి కి సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 99 రోజులపాటు ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామాలు పట్టణాల్లో ప్రధాన సమస్యలన పరిష్కారం.. రెండున్నర సంవత్సరాల ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరికి అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో దేశంలోనే మహత్తరమైన అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. దేశానికే తెలంగాణ మోడల్ అభివృద్ధిలో నిలుస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి లక్ష కోట్లు బడ్జెట్ కేటాయించిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమేనని పేర్కొన్నారు. అత్యధికంగా పంట పండించడంలోనూ అత్యధికంగా ధాన్యాన్ని సేకరించడం లో తెలంగాణ ప్రభుత్వానికి సాటి లేరని స్పష్టం చేశారు.

**రాజకీయాలకు అతీతంగా విజయవంతం చేయాలి..**
**- మంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని రాజకీయాల కతీతంగా అందరూ కలిసి విజయవంతం చేయాలని రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్లు యంత్రాంగం ముందుండి విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ ప్రణాళికను సమర్ధవంతంగా నిర్వహించేలా కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, రోడ్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఇండ్లలో శిథిలావస్థలో ఉన్న టీవీలు కంప్యూటర్లు ఇతర వస్తువులను ఈ వేస్ట్ విధానం ద్వారా సేకరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బృహత్తరమైన ఆశయంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ప్రజలందరూ పెద్ద బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఇందులో వార్డు మెంబరు నుంచి సర్పంచులు, కౌన్సిలర్లు కార్పొరేటర్లు మున్సిపల్ చైర్మన్లు, మేయర్లుచ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలు అందరూ స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కోరారు.

## తుమ్మల దేవరావుకు బీఎన్ శాస్త్రి ధర్మనిధి పురస్కారం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ప్రతి ఏటా భాషా, సాహిత్యం, చరిత్ర రంగాల్లో విశేషంగా కృషి చేస్తున్న వారికి అందజేస్తున్న ధర్మనిధి పురస్కారం ఈ ఏట నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన తుమ్మల దేవరావును వరించింది. తుమ్మల 25 సంవత్సరాలుగా చరిత్రను పరిశోధన చేస్తూ17 కన్నడ, తెలుగు, ఉర్దూ, ఫారసి శాసనాలను వెలుగులోకి తెచ్చారు. మరుగున పడిన ఎన్నో శిల్ప ప్రతిమలను వెలుగులోకి తెచ్చారు. రాంజీగొండు చరిత్రను వెలుగులోకి తెచ్చారు. వీరి కృషికి తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం, భాషా సాంస్కృతిక శాఖ ఉత్తమ పరిశోధన పురస్కారం. సినారే పురస్కారం, సినారే కళా పీఠం జాతీయ పురస్కారం, రంజని కుందుర్తి, ఎక్స్ రే, కవిసంధ్య, గుఱ్ఱం జాషువా, విమల శాంతి, గిడుగు రామామూర్తి పంతులు జాతీయ అవార్డులను అందుకున్నారు.

# క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

**- మేయర్ కోలగని శ్రీనివాస్**



**ముద్ర, కరీంనగర్:** క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కరీంనగర్ మేయర్ కోలగని శ్రీనివాస్ అన్నారు. ఖేలో ఇండియాలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తలపెట్టిన ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవంలో భాగంగా శుక్రవారం కరీంనగర్ పార్లమెంట్ స్థాయి క్రీడా పోటీలు స్థానిక అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో వివిధ క్రీడా పోటీల్లో అర్హత సాధించి, విజేతలుగా నిలిచిన టీంలకు పోటీలు నిర్వహించారు. క్రీడా పోటీలకు ముఖ్య అతిథులుగా స్థానిక

మేయర్, డిప్యూటీ మేయర్ కోలగని శ్రీనివాస్, సునీల్ రావు, కరీంనగర్ , రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవన శైలిలో క్రీడలు ఒక భాగమన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకునే కాకుండా, మానసిక సమస్యలను దూరం చేస్తాయన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ క్రీడ లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహో త్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పార్లమెంటు స్థాయిలో విజేతలుగా నిలిచే మొదటి, రెండవ స్థానం పొందిన టీం లకు ఈ నెల 8 న బహుమతుల ప్రధానోత్సవం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిల్లపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, కార్పొరేటర్ లు బోయిన్ పల్లి ప్రవీణ్ రావు, కేపీ చంద్ర, నాంపల్లి శ్రీనివాస్, తాటి ప్రభావతి, పెద్దపల్లి శ్రీలేఖ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ గుజ్జ శ్రీనివాస్, ఎర్రం మహేష్, కరండ్ల మధుకర్, తణుకు సాయి కృష్ణ, శ్రవణ్, విమల్ తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజా పాలన' పకడ్బందీగా నిర్వహించాలి

**- కలెక్టర్ అభిలాష అభినవ్**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి ఎంపీ గోడం నగేష్, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖలకు కేటాయించిన పనులన్నీ ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యే క పారిశుధ్య కార్యక్రమాలు, పెండింగ్ ఫైల్స్ పరిష్కారం, వైద్యారోగ్య కార్యక్రమాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన, అరైవ్ అలైవ్ తదితర కార్యక్రమాలన్నీ ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సంయుక్త భాగస్వామ్యంతో 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణను స్వయంగా తానే పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాలలో పాల్గొనాలని తెలిపారు. అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమా వేశంలో అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ముధోల్ ఎమ్మెల్మే పవార్ రామారావు పటేల్, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, నిర్మల్, భైంసా ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు సోమ భీమ్ రెడ్డి, షిండే ఆనంద్ రావు పటేల్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో ఆక్రమణల తొలగింపు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ పట్టణ మండలం కంచరోని చెరువు శిఖం భూముల ఆక్రమణలను అధికారులు శుక్రవారం తొలగించారు. చెరువు శిఖం భూముల్లో గుర్తు తెలియని వ్యక్తులు ప్లాట్ లు ఏర్పాటు చేసి విక్రయించే ప్రయత్నం చేశారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఆ ప్రదేశానికి వెళ్లి ఆక్రమణలు తొలగించారు. అక్కడ వేసిన మొరం తీసివేసియించారు.

## డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ఘనంగా ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో పది రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించి వివిధ కమిటీలు ఏర్పాటు చేశారు. కాలేజీలోని ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

## తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థుల ప్రతిభ

**ముద్ర, హైదరాబాద్:** దళిత వర్గాల యువతకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రు శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన సివిల్ సర్వీసెస్ పరీక్ష–2025 తుది ఫలితాల్లో తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లాకు చెందిన ఆశిష్ దేశవ్యాప్తంగా AIR–676 ర్యాంక్ సాధించగా, ములుగు జిల్లాకు చెందిన ప్రవీణ్ కుమార్ AIR–793 ర్యాంక్ సాధించారు. వీరికి ఇండియన్ పోలీస్ సర్వీస్ (IPS) పొందే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, ఉపాధ్యక్షురాలు విజయేంద్ర, అభినందించారు.

## వైభవంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**గోపాల్ రావుపేట, ముద్ర:** కరీంనగర్ జిల్లా రామడుగు మండలం, గోపాల్రావుపేటలో హరిమౌనస్వామి (రోటీగూడెం) దివ్య సాన్నిధ్యంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 14 ఏళ్ల కుంభమేళా సందర్భాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా, 108 అష్టోత్తర శతకుండలముల గీతాహవన యజ్ఞం నిర్వహించడం విశేషం. మార్చి 1వ తేదీ నుండి ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, సామూహిక శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం, మరియు ద్రావిడ ప్రబంధ పారాయణాలు భక్తిపూర్వకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీగా తరలివస్తున్నారు.

## అర్హులకు సంక్షేమ పథకాలు చేరాలి




**మహదేవపూర్, ముద్ర:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లిపారు.శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై మహబూబాబాద్ ఐడీఓసి కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నెల 6వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రి కొండా సురేఖమాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ఈ సమావేశానికి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్,ఎమ్మెల్సి రవీందర్ రావు, ఎమ్మెల్యేలు మరళి నాయక్, దొంతి మాధవరెడ్డి, రాజేందర్ రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కూడా చైర్మన్ ఇనుగల వెంకట్రామిరెడ్డి,ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

**మేరీ సెలెస్టే నౌక రహస్యం**

1872లో ఈ నౌక సముద్రంలో ఖాళీగా కనిపించింది. నౌక సిబ్బంది ఏమయ్యారో ఇప్పటికీ తెలియలేదు.





# ఇందిరమ్మ నిర్మాణాలు పూర్తి చేయాలి

- **భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

వివిధ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం బొమ్మలరామారం మండలం నాగినేపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో గ్రామంలో మొత్తం ఎన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని, వాటిలో ఎన్ని ఇళ్లు నిర్మాణాలు పూర్తి అయ్యాయని, మిగిలినవి ఏ.ఏ దశలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ ను లబ్ధిదారులకు తక్కువ ధరకు ఇప్పించి ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేయాలన్నారు. ఇప్పటి వరకు నిర్మాణం అయినంత వరకు లబ్ధిదారుల అకౌంట్ లలో డబ్బులు జమ అవుతున్నాయా అని ఆరా తీశారు. వివిధ దశలో మిగిలి ఉన్న నిర్మాణ పనులను కూడా పూర్తి చేస్తే చివరి బిల్లు కూడా వస్తుందని త్వరగా పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేపట్టాలన్నారు.

# గ్రామీణ రోడ్లకు మహర్దశ

- **రూ.130 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు**
- **ఫలించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి కృషి**

**ముద్ర ప్రతినిధి, కోదాడ:**



కోదాడ, హుజూర్ నగర్ నియోజక వర్గాల్లో పలు రహదారులకు మహర్దశ పట్టింది. సింగిల్ లైన్ గా ఉన్న 49 కిలో మీటర్ల రోడ్లను డబల్ లైన్ గా చేసేందుకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి గాను పాలనా పరమైన అనుమతులతో పాటు, ప్రభుత్వం ఏక కాలంలో మేజర్ డిస్ట్రిక్ రోడ్ ప్లాన్ (ఎం డి ఆర్) కింద రూ.130 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కోదాడ నియోజకవర్గం పరిధిలో రూ.30 కోట్లతో కోదాడ నుండి అనంతగిరి వరకు 6.60 కిమీ ల మేర ఏడు మీటర్ల నుండి పది మీటర్ల మేర వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీనితో కోదాడ, ఖానాపురం, అనంతగిరి గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. రూ.24 కోట్లతో నేషనల్ హైవే 65 నుండి నేలమర్రి వరకు 10 కిమీ ల మేర సింగిల్ లైన్ నుండి డబల్ లైన్ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీంతో తాడ్వాయి తండ, తాడ్వాయి, వెంకట్రాంపురం, నేలమర్రి గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. అదే విదంగా రూ.14 కోట్లతో కాపుగల్లు నుండి దొరకుంట వరకు 6 కిమీ మేర సింగిల్ లైన్ నుండి డబల్ లైన్ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీనితో కాపుగల్లు, దొరకుంట ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. ఇక హుజూర్ నగర్ నియోజకవర్గ పరిధిలో రూ.62 కోట్లతో 26.50 కిమీ ల డబల్ రోడ్డు మంజూరు పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తద్వారా ఈ నియోజకవర్గంలో 15 గ్రామాలకు ప్రయాణ సౌకర్యం సులువుగా మారనుంది. రూ.32 కోట్లతో చింతలపాలెం నుండి కిష్టాపురం వరకు 9.20 కిమీ ల మేర సింగిల్ లైన్ నుండి డబల్ లైన్ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీనితో చింతలపాలెం, శోభనాద్రిగూడెం, అడ్లూరు, తమ్మారం, కొత్తూరు, కిష్టాపురం గ్రామ ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. అదేవిధంగా రామలక్ష్మిపురం నుండి హుజూర్ నగర్ బైపాస్ రోడ్డు వరకు 3.80 కిమీ ల మేర సింగిల్ లైన్ నుండి డబల్ లైన్ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీనితో రామలక్ష్మిపురం, యర్రారం , హుజూర్ నగర్ ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. రూ.30 కోట్లతో అమరవరం నుండి కొత్త తండ వరకు 5.50 కిమీ ల మేర సింగిల్ లైన్ నుండి డబల్ లైన్ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీనితో అమరవరం, అంజలిపురం తండ, కొత్తతండ ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. గుడుగుంట్ల పాలెం నుండి ఎల్లాపురం వరకు 8.00 కిమీ ల మేర సింగిల్ లైన్ నుండి డబల్ లైన్ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీనితో గుడుగుంట్ల పాలెం, మూసి ఒడ్డు సింగారం, ఎల్లాపురం గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ తక్షణమే టెండర్లు పిలిచి యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు.



# రఘునాథపాలెం సర్పంచ్ కు సన్మానం

**ముద్ర, ఖమ్మం:**

రఘునాథపాలెం గ్రామపంచాయతీకి ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ గాజుల క్రిష్ణను వీర నారీమణుల ఆశయ సాధన సమితీ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి నిరంతరం పనిచేయాలని సర్పంచ్ ను కోరారు. ఈ నెల 7న మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో నిర్వహించే మహిళా దినోత్సవం వేడుకలకు సతీ సమేతంగా హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాణోత్ భద్రు నాయక్, వీరనారీమణుల ఆశయ సాధన సమితీ ఉపాధ్యక్షురాలు భూక్యా జ్యోతి, సహాయ కార్యదర్శి ఎ.సరోజిని, కోశధికారి నల్లా నాగమణి, కార్యదర్శి కే.స్పందన తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పోరాటాలకు సిద్ధం

- **మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇంటింటికి సీపీఎం కార్యక్రమం**
- **పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్**

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**




యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజా సమస్యలపై మార్చి 8 నుండి 31 వరకు ఇంటింటికి సిపిఎం ద్వారా సమస్యలు అధ్యయనం చేసి గ్రామీణ ఉద్యమాలు నిర్వహిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ తెలిపారు. శుక్రవారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన ప్రెస్ మీట్ కార్యక్రమంలో జహంగీర్ పాల్గొని మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో అనేక సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని రోజులు గడుస్తున్న పాలకులు మారుతున్న జిల్లా అభివృద్ధిలో మాత్రం పురోగతిలో లేదని అన్నారు. జిల్లా ఏర్పడి పది సంవత్సరాలు గడుస్తున్న మౌలిక సమస్యలు ఎందుకు పెండింగ్ లో ఉన్నాయో జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజలకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం, సారవంతమైన భూములున్న సరైనా సాగు నీటి వసతులు లేక పంట భూములు బీళ్లుగా మారుతున్నాయని ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న బస్వాపురం ప్రాజెక్టు పనులు నిధులు లేక పూర్తి కావడం లేదని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు బొలగాని జయరాములు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా

**ముద్ర, ఆత్మకూర్ (ఎం):**

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూరల కిష్టయ్య మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీ కార్మికునికి రూ.26 వేలు వేతనం ఇస్తూ గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుని అకౌంట్లో జమ చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేదని, తమ డిమాండ్లను పరిష్కరించని ఎడల సమ్మెకు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఇంద్ర పెల్లి జ్ఞానేశ్వర్, రేగటి శీను వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని రమేష్, కల్వల లక్ష్మయ్య, కొలపాక నరసయ్య, మేడే యాదయ్య, తాళ్లపల్లి నరసయ్య, వేముల లక్ష్మి, లలిత, ఉప్పలమ్మ పాల్గొన్నారు.



# రంజాన్ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

రంజాన్ వేడుకలు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా ఈద్ గా, చెరువు కట్ట మస్జీద్ ఏ ఖాజి గూడ స్మశానం వాటికలో మున్సిపల్ కమిషనర్ రామలింగంతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమం లో గ్రంధాలయం చైర్మన్ అవైస్ చిస్తీ, ఈద్ గా కాతిబ్ ఎండీ ఫరూక్, వార్డ్ కౌన్సిలర్ తోటకూరి విజయ లక్ష్మి వెంకటేష్ యాదవ్, ఎండీ లాయిక్ అహ్మద్, బురహన్, షఫీక్ అహ్మద్, మజర్, ఎండీ జహంగీర్, ఎండీ షరీఫ్, ఇక్బాల్ చూదరి, అమీన్, మైమన్, అత్తర్, ఎండీ మజర్, ఎండీ ఇల్యాస్, తహర్ షరీఫ్ పాల్గున్నారు.




## పేదలకు రంజాన్ తోఫా పంపిణీ

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

భువనగిరి పట్టణంలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు మేరాజ్ గ్రూప్ ఆఫ్ హైదరాబాద్ సౌజన్యంతో రంజాన్ తోఫా జిల్లా మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు ఇంతియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం యూత్ నాయకులు మోసిన్ అఖిల్, వసీమ్, సైఫ్, బాబా జాహెద్ పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రణాళిక విజయవంతం చేయాలి

- **భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్ రావు**

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం భువనగిరి పురపాలక సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ త్రిల్లేశ్వర్ రావు, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్, వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, భువనగిరి మున్సిపల్ కమిషనర్ జి. రామలింగం పరిసరాల పరిశుభ్రత కు సంబంధించి భువనగిరి మున్సిపాలిటీ చేపడుతున్న అన్ని కార్యక్రమాలలో పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ భువనగిరి పురపాలక సంఘ పరిధిలోని మొత్తం 35 వార్డులలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అందరీతో కలిసి 8వ వార్డులో స్వయంగా చీపురు పట్టి రోడ్లు ఊడ్చి చెత్త ఎత్తి ఇట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అన్ని వాటిల్లో విజయవంతంగా చేయాలని కోరారు.



## ప్రజల సంక్షేమమే లక్ష్యం

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించిందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరిపల్లి 2వ వార్డులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ వాణి భారత్ గౌడ్ మున్సిపల్ కార్మికుల తో కలసి చీపురు పట్టి చెత్తను ఊడ్చి తట్టలో ఎత్తి ఆటోలో పోశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల నాయకులు పాల్గొన్నారు.

## అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవతో మొదలుకొని నిత్య కైంకర్యాలు జరిగాయి. సహస్ర నామార్చన సేవతో పాటు లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. సాయంత్రం శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.



# ప్రజలతో మమేకమవ్వాలి

- **99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**
- **సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**ముద్ర, సూర్యాపేట:**

అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా ప్రజలతో మమేకమై పనిచేస్తూ 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శుక్రవారం బాలేంల గ్రామ పంచాయతీ కార్యాలయంలో 99 రోజుల కార్యక్రమం అమలు పై నిర్వహించిన సన్నాహక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతనంగా గెలిచిన స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రజలలో మంచి పేరు సుస్థిరం చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, మార్చి 6 నుంచి మార్చి 15 వరకు జరిగే ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ లో స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పెండింగ్ ఫైల్స్ క్లియర్, తాగునీరు, విద్య, వైద్యం పై వచ్చిన దరఖాస్తులు పది రోజులలో క్లియర్ చేయాలని కలెక్టర్ అన్నారు. 99 రోజుల కార్యక్రమంలో చివరి వరకు ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొనాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పేద ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. బాలేంల గ్రామంలో ప్రజలతో కలెక్టర్ ముచ్చటించారు మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిచెన్ షెడ్లు, స్టోర్ రూమ్, వంట శాల, కంప్యూటర్ రూమ్ ల్యాబ్ పరిశీలించారు, స్కూలుకు సంబంధించిన బిల్లులు ఆన్‌లైన్లో ఎలా చేస్తారు అని అడిగి తెలుసుకున్నారు 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ మంచి మార్కులు తెచ్చుకోవాలని, ప్రతి సబ్జెక్టులో నూటికి 70 శాతం మార్కులు రావాలని కలెక్టర్ కోరారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల భోజన వసతులు అడిగి తెలుసుకున్నారు, పల్లె దవాఖానా లో ఏ ఎన్ ఎంలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, ఆర్డీఓ వేణు మాధవరావు, తహసిల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీఓ లింగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రసాదు, ఉపాధ్యాయులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 07-03-2026
www.mudranews.in | @mudranews



**లోక్ నెస్ మాన్‌స్టర్ కథ**

స్కాట్లాండ్‌లోని లోక్ నెస్ సరస్సులో ఒక భారీ జీవి ఉందని చాలా మంది చెబుతారు. కానీ దీనికి ఖచ్చితమైన ఆధారాలు లభించలేదు.





## ముని్సపాలిటీ అభివృద్ధికి
# అందరూ కృషి చేయాలి

ముద్ర, కామారెడ్డి:

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఎల్లారెడ్డి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అందరూ కృషి చేయాలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ భాగ్యమ్మ సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, సిబ్బందితో కలిసి ఆమె ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ''ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక''ను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ సహకారంతో మున్సిపల్ పరిధిలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంపై మహిళా సంఘాలు, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సిద్ధి శ్రీధర్, దశరథ్, చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్ మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశాంత్ గౌడ్, శ్యామ్, రఫిక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ర్యాలీ




## - ప్రారంభించిన చైర్ పర్సన్ రాధిక

ముద్ర ప్రతినిధి, మెదక్:

99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీని మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు జెండా ఊపి ప్రారంభించారు. మెదక్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు.

అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి రాం దాస్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్, మెప్మా సిబ్బంది, ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో నీటి కష్టాలుండొద్దు

**- 99 రోజుల కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేయాలి - ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశంలో ఇంచార్జి మంత్రి వివేక్**





ముద్ర ప్రతినిధి, మెదక్

వేసవిలో త్రాగునీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలలో బోర్ల రిపేర్లు, ప్రత్యామ్నాయ తాగునీరు సరఫరాకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. శుక్రవారం మెదక్ సమీకృత కలెక్టరేట్ లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై ఉమ్మడి (మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట) మెదక్ జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ అసెంబ్లీలో చర్చించి తాగునీరు సమస్య రాకుండా తాత్కాలిక పనుల కోసం అనుమతులు తీసుకుంటామన్నారు. నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని, అధికారులంతా ప్రజలతో మమేకం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణలో ఉమ్మడి మెదక్ జిల్లా మొదటి స్థానంలో ఉండేలా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఘనంగా నిర్వహించాలన్నారు. నంగునూరు మండలం నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీనీ ప్రారంభించేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటానన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో తాగునీరు సమస్య తలెత్తకుండా చూడాలని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకునేలా వారిని మానిటర్ చేయాలని ఆదేశించారు. గుమ్మడిదలలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, సోలార్ విద్యుత్తు సౌకర్యాన్ని కల్పించే సూర్య ఘర్ యోజన పథకంపై రివ్యూ చేయాలన్నారు. ఏటిసిలు త్వరగా నిర్మాణమయ్యేలా టిజీఐఐసి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో 6 గ్యారంటీలు ప్రజలకు పూర్తిగా అందేలా చూడాలని, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులచే గృహ ప్రవేశాలు చేయించాలని అధిగారులకు సూచించారు. మన దేశ అవసరాలకు మించి వరి పంట దేశంలో పండుతుంది, రైతులు లబ్ధి పొందేలా 30% పంట మార్పిడి చేయించాలన్నారు. అధిక ఆదాయాన్ని సమకూర్చే ఆయిల్ ఫామ్ తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. విద్యా, వైద్యం చాలా ముఖ్యం, పేద ప్రజలకు నాణ్యమైన విద్యా, వైద్య సేవలందించాలన్నారు. రేషన్ కార్డులు, డిజిటల్ హెల్త్ కార్డ్స్ అర్హత ఉన్న పేదలందరికీ అందేలా చూడాలన్నారు.

ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో డంపింగ్ యార్డ్ లు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాలు అధికంగా నడిచే ప్రాంతాల్లో అండర్ పాస్ నిర్మించాలని, అపోజిట్ లో వాహనాలు వెళ్లకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకువాలని, ఆయిల్ ఫామ్ అధికంగా సాగు చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఒపీ ఫీజులు వసూలు చేయకుండా చూడాలన్నారు.

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. పాల ఉత్పత్తులు పెంచాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులకు డిప్యూటేషన్లు ఇవ్వోదన్నారు.

మెదక్ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ రామాయంపేటలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పనులు ప్రారంభించాలన్నారు.

టిజిఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ బసవేశ్వర ప్రాజెక్ట్ పనులు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించాలన్నారు. భూములు కోల్పోయిన వారిని ఆదుకోవాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఆయిల్ ఫామ్ ను అభివృద్ధి చేయాలన్నారు.


మెదక్ కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 హామీలను నెరవేర్చే దిశగా పని చేస్తామన్నారు. జిల్లాలోని 2 నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించడం జరిగిందని అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 15 తేదీ వరకు కొనసాగనున్న పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ అధికారులతో పాటు ప్రజలు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమాన్ని ప్రణాళిక బద్ధంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు.

ఈ సమావేశంలో మెదక్ ఎస్పీ శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్లు నగేష్, మాధురి, అబ్దుల్ హమీద్, మెదక్ మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు, మూడు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

### కాలుష్యంపై దృష్టి పెట్టండి..
**- ఎంపీ రఘునందన్ రావు**



వివిధ నిర్మాణాలు, రహదారులు, పరిశ్రమలలో కాలుష్యాన్ని తగ్గించాలి. ప్లాస్టిక్ వ్యర్థాల నుండి డీజిల్ ను తీసేందుకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థకు సిద్దిపేట పట్టణంలో, మెదక్, సంగారెడ్డిలో అర ఎకరం స్థలం ఇవ్వాలి. దుబ్బాక, రామాయంపేట, పటాన్చెరులో ఆర్డీఓ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. ఏటా దేశవ్యాప్తంగా లక్షా 25 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు. రవాణా శాఖ డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చేటప్పుడు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించాలి.

### ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి..
**- ఎంపీ సురేష్ షెట్కార్**



గ్రామ స్థాయిలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మహిళలకు హెల్త్ ప్రొఫైల్ చెక్ చేయాలి. వైద్య పోస్టులు భర్తీ చేయాలి, డాక్టర్లు అందుబాటులో ఉండాలి. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మరమ్మత్తు చేయాలి. రైతుల వివరాలు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ నమోదు చేసేలా చూడాలి.

## సివిల్స్ లో అటెండర్ కుమారుడి సత్తా..

ముద్ర ప్రతినిధి, మెదక్:



మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పోతారం గ్రామానికి చెందిన యువకుడు సివిల్స్ లో సత్తా చాటాడు. గ్రామానికి చెందిన కుమ్మరి యాదగిరి, జ్యోతి కుమారుడైన కుమ్మరి శ్రావణ్ కుమార్ యూపీఎస్సీ పరీక్ష ఫలితాల్లో 768 ర్యాంక్ సాధించారు. కాగా గ్రూప్-1 ఫలితాల్లో కూడా విజయం సాధించి ఇటీవలే ఉద్యోగంలో జాయిన్ అయ్యాడు. ఏడాది క్రితం శ్రవణ్ తల్లి జ్యోతి బస్సు ప్రమాదంలో మరణించింది. తండ్రి యాదగిరి ఓ ప్రైవేట్ పాఠశాలలో అటెండర్ గా పనిచేస్తున్నారు.

## ప్రయాణికులకు సురక్షితమే ముఖ్యం

ముద్ర, నిజామాబాద్:

వాహనదారులు, ప్రయాణికులకు వేగం ముఖ్యం కాదని, సురక్షితంగా గమ్యం చేరుకోవడమే ముఖ్యమని బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి అన్నారు. శుక్రవారం బిచ్కుంద సర్కిల్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు 'అరైవ్ - అలైవ్' కార్యక్రమంలో భాగంగా నేత్ర పరీక్షలు నిర్వహించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ రవి కుమార్, ఎస్సై గుండెల రాజు తదితరులు పాల్గొన్నారు.

## వయో వృద్ధుల కోసం. .
# డే కేర్ సెంటర్ ప్రారంభం



ముద్ర ప్రతినిధి, మెదక్:

మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వయో వృద్ధుల సంక్షేమం కోసం డే కేర్ కేంద్రాన్ని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఎంపీ రఘునందనరావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ... తన సొంత నిధులతో బ్యాటరీ వెహికల్ ను అందిస్తామని అన్నారు. డే కేర్ సెంటర్ ద్వారా మెదక్ జిల్లాలోని వయోవృద్ధులు కాలక్షేపం కోసం ఆట సామగ్రి, వార్తా పత్రికలు, పుస్తకాలు, సరదాగా వంట చేసుకొని తినడానికి వంట సామగ్రి కూడా అందుబాటులో ఉంటుందన్నారు. వయోవృద్ధులు వారి శేష జీవితంలో ఎటువంటి సమస్యలు ఉన్న వాటన్నిటిని వదిలి ఈ డే కేర్ సెంటర్ లో అందరు వయోవృద్ధులతో సంతోషంగా ఉండవచ్చని సూచించారు.

అనంతరం ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ వయో వృద్ధుల సంక్షేమానికే అధికారులందరూ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్పర్సన్ కానుగు రాధిక, వైస్ చైర్పర్సన్ నరేష్ గౌడ్, సేవాసంఘం స్వచ్ఛంద సంస్థ సతీష్, శ్రీధర్, డిసబుల్ సెక్షన్ అధికారి జింక రవీందర్, వయో వృద్ధులు పాల్గొన్నారు.

## గర్ల్స్ హాస్టల్ ను ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

ముద్ర, నిజామాబాద్:

బాన్సువాడలోని గర్ల్స్ హాస్టల్ ను ఎంఈఓ నాగేశ్వరరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వసతి గృహంలో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశాల మేరకు వసతి గృహాన్ని తనిఖీ చేసినట్లు ఎంఈఓ నాగేశ్వరరావు తెలిపారు. వసతి గృహంలో భోజనాన్ని పరిశీలించారు.

వసతి గృహంలోని వంటగది, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్, ప్లే గ్రౌండ్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినిల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఈఓ వెంట వసతి గృహ వార్డెన్ అర్చన ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**



ముద్ర, సంగారెడ్డి:

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. సంగారెడ్డి జిల్లా, హత్నూర మండల పరిధిలోని మంగపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగంగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదా రులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులు ఇవ్వాలని అన్నారు. గ్రామంలో మంజూరైన ఇండ్ల సంఖ్య, నిర్మాణ దశలు, లబ్ధిదారుల ఖాతాల్లో నిధుల జమ వంటి అంశాలపై ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈలతో సమీక్ష నిర్వహించారు. స్లాబ్ పనులు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు ఏప్రిల్ 20-26 వరకు గృహప్రవేశ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు.


వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కాసాల గ్రామంలోని డీసీ ఎంఎస్ ఎఫ్ఎస్‌సీ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వలను పరిశీలించారు. విక్రయాలకు సంబంధించిన రికార్డులు, బిల్లుబుక్స్, స్టాక్ బోర్డు వివరాలను తనిఖీ చేసి అధికారులను పలు విషయాలపై ప్రశ్నించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా వ్యవసాయ శాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి చలపతిరావు, సర్పంచ్ మన్నే రాధా రమేష్, తహసీల్దార్, ఎంపీడీఓ పంచాయితీ సెక్రటరీ, ఇంజినీరింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' ప్రారంభం

ముద్ర, సంగారెడ్డి:

తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి 10 రోజుల ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. ప్రణాళిక ప్రకారం అన్ని కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. అదే విధంగా స్థానిక మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అరుణ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యార్థినులతో కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. పచ్చదనం, పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.



## వోయ్నిచ్ మాన్యుస్క్రిప్ట్ రహస్యం

ఈ పుస్తకం ఒక తెలియని భాషలో రాయబడింది. ఇప్పటి-వరకు ప్రపంచంలోని నిపుణులు కూడా దానిని పూర్తిగా డీకోడ్ చేయలేకపోయారు.



# నా మనోవేదన తీరింది

- లిక్కర్ కేసులో నన్ను నాలుగేళ్లు వేధించారు
- శ్రీవారి దయతో ఆ కేసులో క్లీన్ చీట్ వచ్చింది
- త్వరలో రాజకీయ పార్టీ పెట్టబోతున్న
- తెలుగు ప్రజలపై స్వామి ఆశీస్సులు ఉండాలి
- జాగృతి అధ్యక్షురాలు కవిత



**ముద్ర, తిరుపతి:**

నాలుగేళ్లుగా తాను పడుతున్న మనోవేదన వేంకటేశ్వరస్వామి దయతో తీరిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కవిత తన భర్తతో కలిసి శుక్రవారం వేకువజామున శ్రీవారి అభిషేక సేవలో పాల్గొన్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఢిల్లీ మద్యం కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో శ్రీవారికి మొక్కులు చెల్లించేందుకు కాలినడకన వచ్చానని తెలిపారు. సత్యం, న్యాయం, ధర్మం తమవైపు ఉందని ముందు నుంచే చెబుతూ వచ్చానన్నారు. చివరకు న్యాయస్థానం కూడా స్వామి వారి దయతో క్లీన్ చిట్ ఇచ్చిందన్నారు. అందుకే కాలినడకన వచ్చి స్వామివారికి మొక్కు చెల్లించుకున్నట్లు వివరించారు. తెలంగాణ ప్రజల పక్షాన ఇంటి పార్టీగా పని చేయడానికి రానున్న రోజుల్లో రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నామని కవిత ప్రకటించారు. ఈ పార్టీకి స్వామి వారి ఆశీస్సులు, దయ ఉండాలని కోరుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాలుగా విడిపోయినా ఆయా ప్రాంతాల ప్రజలుగా కలిసి ఉండాలని, బాగుండాలని కోరుకున్నట్లు చెప్పారు.

# అప్పుల బాధతో స్టాఫ్ నర్స్ ఆత్మహత్య

**ముద్ర, కూకట్‌పల్లి:**



ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తున్న వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన కామిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి (37) ఐదేళ్లుగా కూకట్‌పల్లిలోని వివేకానందనగర్‌లో నివసిస్తున్నాడు. ఇతను నెక్స్‌జెన్ హాస్పిటల్‌లో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తూ తన భార్య, తల్లి, కుమార్తెతో కలిసి ఉంటున్నాడు. గురువారం రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో వెంకటేశ్వర్ రెడ్డి మద్యం మత్తులో ఇంటికి వచ్చాడు. తనకు అప్పులు ఎక్కువయ్యాయని, తనకున్న భూమి అమ్మి ఆ అప్పులు తీర్చుకుంటానని ఇంట్లో వారితో గట్టిగా అరిచి చెప్పాడు. అనంతరం తన బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఆ సమయంలో భార్య, కూతురు పక్క గదిలో, తల్లి హాల్‌లో నిద్రపోయారు. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో తల్లి, భార్య కలిసి ఎంత పిలిచినా లోపలి నుండి స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లారు. అప్పటికే వెంకటేశ్వర్ రెడ్డి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. మృతుడి తల్లి భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# ఇంజనీరింగ్ ఫీజులు ఖరారు

- ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా
- ట్యూషన్ ఫీజులోనే అడ్మిషన్, ఇతర ప్రత్యేక ఫీజులు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్రంలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ (బిఈ/బీటెక్) కోర్సులకు సంబంధించిన ఫీజుల నిర్మాణాన్ని ప్రభుత్వం అధికారికంగా ఖరారు చేసింది. 202526 విద్యా సంవత్సరం నుంచి 202728 వరకు వర్తించే ఈ కొత్త ఫీజులపై ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా శుక్రవారం జీవో నెం.06తో ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా నిర్ణయించిన ఫీజులు 202526 నుంచి 202728 విద్యా సంవత్సరానికి వర్తించనున్నాయి. తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ సమర్పించిన సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ ఫీజులను నిర్ణయించినట్లు తెలిసింది. ఖరారు చేసిన ట్యూషన్ ఫీజులో అడ్మిషన్ ఫీజు, ఇతర ప్రత్యేక ఫీజులు ఉన్నాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**టాప్ ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజులు ఇలా..**

ప్రభుత్వం విడుదల చేసిన అనుబంధ జాబితా ప్రకారం చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రూ.1,83,000, వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లో రూ.1,75,000, మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో రూ.1,67,000, సీవీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్లో రూ.1,63,00, వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇన్‌స్టిట్యూట్: రూ.1,59,600, బి.వి. రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రూ .1,46,600గా నిర్ణయించారు. అలాగే రాష్ట్రంలోని పలు సాధారణ ఇంజినీరింగ్ కళాశాలలకు ఏడాదికి కనీస ఫీజుగా రూ.45 వేలుగా ప్రభుత్వం ఖరారు చేసింది. ఫీజుల వసూలు విషయంలో ప్రభుత్వం పలు మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అదనంగా క్యాపిటేషన్ ఫీజు లేదా డొనేషన్ల రూపంలో ఎలాంటి వసూళ్లకు పాల్పడకూడదని పేర్కొంది. వార్షిక ట్యూషన్ ఫీజును ఒకేసారి లేదా వాయిదాల పద్ధతిలో అడ్వాన్స్‌గా వసూలు చేసుకోవచ్చు. కళాశాలలు సమర్పించిన వివరాల ఆధారంగా ప్రస్తుతం ఫీజులు నిర్ణయించినప్పటికీ, భవిష్యత్తులో భౌతిక తనిఖీల్లో ఏవైనా తప్పుడు వివరాలు ఉన్నట్లు తేలితే ఫీజులను సవరించడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.






# నేను అందరివాడను

- నన్ను ఎవరు ఎలా పిలిచినా పట్టించుకోను
- పది మందికి సేవ చేయడానికే సీఎం అయ్యా
- మహా భారతంలో కర్ణుడు, బార్బరీకుడి పాత్రలు నాకిష్టం
- మిత్ర ధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డ
- రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా మాదిగల పక్కన నిలబడిన
- నాపై జరుగుతోన్న దాడులకు మీ జాతి అండగా ఉండాలి
- మాదిగ ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ సన్మాన కార్యక్రమంలో సీఎం రేవంత్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్రానికి సీఎంగా అన్ని వర్గాలకు తాను అందరివాడినని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎవరు ఏ పేరుతో పిలిచినా నాకు వచ్చిన ఇబ్బందేమీ లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసినప్పుడు రేవంత్ మాదిగ, బీసీలు రేవంత్ యాదవ్, వాకిటి శ్రీహరి కి మంత్రి పదవి ఇస్తే రేవంత్ ముదిరాజ్ అని, సిక్కులు సర్దార్ రేవంత్ అని అసదుద్దీన్ కు సాయం చేశానని రేవంతుద్దీన్ అని ప్రతిపక్షాలు తనపై సెటర్లు వేసి పైశాచికానందం పొందారన్నారు. అయినా వారి ఆరోపణలు, విమర్శలను తాను పట్టించుకోలేదని తేల్చి చెప్పారు. సీఎంగా వచ్చిన అవకాశాన్ని పది మంది కి సాయం చేయడానికే అని భావిస్తున్నట్లు వెల్లడించారు. వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని మీ జాతికి చేయూత ఇచ్చినప్పుడే నాకు నిజమైన సంతోషం కల్గుతుందని చెప్పారు. మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ లోని శిల్ప కళావేదికలో సీఎం రేవంత్ రెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంపై రేవంత్ రెడ్డికి మాదిగ సామాజికవర్గ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2023 ఎన్నికల్లో కష్టపడి ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని అన్నారు. చిత్తశుద్ధితో ప్రజల ముందుకు వచ్చాం కాబట్టే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ జాతి ఎంతో పోరాటం చేసిందని కొనియాడారు. ఈ పోరాటంలో అనేక మంది ప్రాణాలు కూడా కోల్పోయారని గుర్తుచేశారు. స్వయంగా తాను ఎన్నో ఏళ్లుగా వర్గీకరణ సమస్యను ప్రత్యక్ష్యంగా చూస్తూ వచ్చానని తెలిపారు. ఈ న్యాయమైన హక్కుపై మొదటి నుంచి కూడా అనుకూలంగా ఉన్నట్లు చెప్పారు. ఈ సమస్యపై పోరాటం చేసినందుకు గతంలో తనను అసెంబ్లీ నుంచి గెంటేశారని తెలిపారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డానని చెప్పారు. తనతో పాటు అనేక మంది వర్గీకరణ కోసం పోరాటం చేశారని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణేనని సీఎం వెల్లడించారు. వర్గీకరణ అంశంలో మాదిగల వైపు న్యాయం ఉందన్న సీఎం..ఇందులో తనకు ఎటువంటి అనుమానం లేదన్నారు. అందుకే చివరి వరకు మీ పక్షాన ఉన్నానని వెల్లడించారు. ఇది ప్రజలు అందరూ కోరుకుంటే వచ్చిన ప్రభుత్వమని అన్నారు. అంతా సమిష్టిగా కష్టపడి బీఆర్ఎస్‌ను గద్దె దింపినట్లు చెప్పుకొచ్చారు. ముఖ్యంగా తాము మాటలతో కాదు.. కమిట్‌మెంట్‌తో గెలిచామని స్పష్టం చేశారు. ప్రగతి ప్రణాళికలో నిర్లక్ష్యంగా ఉండొద్దని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంక్షేమ ఫలాలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మీరు పన్నులు సక్రమంగా వసూలు చేసి ఖజానా నింపితే పేదలకు మేలు జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ ప్రణాళికలను అమలు చేసేది మీరేనన్నారు. భవిష్యత్‌లో మీ హక్కులకు చట్టబద్ధత కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం గొర్రెలు, బర్రెలు, చేప పిల్లలు ఇచ్చిందన్నారు. కానీ, చెప్పులు కుట్టే ఈ జాతి ప్రజలు డాక్టర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కావాలన్నదే తన తాపత్రాయం అన్నారు.

**విద్య కోసం ప్రత్యేక ప్రణాళికలు..**

పంచడానికి ప్రభుత్వం వద్ద భూములు లేవన్న సీఎం రేవంత్ రెడ్డి చదువు ఒక్కటే ప్రజలకు ఇవ్వగలిగే ఆస్తి అన్నారు. విద్య కోసం ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని ప్రతీ పేదవాడికి విద్యను దగ్గర చేయడానికే స్వయంగా తానే విద్యాశాఖ తీసుకున్నానని రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యా శాఖను ప్రక్షాళన చేశాం. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ తీసుకొచ్చాం.. బ్యాగులతో కూడిన కిట్ ఇవ్వబోతున్నాం.. హెల్తీ ఫుడ్ ఇస్తున్నాం. రాష్ట్రంలో పేదరికమనే కారణం చేత ఎవరూ విద్యకు దూరం కాకుండా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పుకొచ్చారు. మహాభారతంలో తనకు ఇష్టమైన పాత్ర కర్ణుడు, బర్బరీకుడిది అని సీఎం చెప్పారు. కర్ణుడి మాదిరిగా మాదిగల విషయంలో మిత్రధర్మం పాటిస్తున్నట్లు వివరించారు. బర్బరీకుడు బలహీన పక్షాల వైపు నిలబడ్డ వ్యక్తి అనీ, అందుకే మాదిగల విషయంలో వర్గీకరణ కోసం బర్బరీకుడిలా పనిచేశానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు దామోదర్ రాజనర్సింహా, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

# రాఘవ కన్ స్ట్రక్షన్స్ పై నిరాధార ఆరోపణలు

- మంత్రి పొంగులేటి ఇమేజ్‌ను దెబ్బతీసే కుట్ర
- మానస హిల్స్‌లో ఎలాంటి బ్లాస్టింగ్‌లు జరగలేదు
- బీఆర్ఎస్ ఆరోపణలపై వివరణ

**ముద్ర, హైదరాబాద్:**

హైదరాబాద్ జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని మానస హిల్స్ లో పొంగులేటి ప్రసాద్ రెడ్డికి చెందిన రాఘవ కన్ స్ట్రక్షన్స్ లో అనుమతులు లేకుండా క్వారీలు నిర్వహిస్తుందని మాజీ మంత్రి హరీష్ రావు, ఇతర బీఆర్ఎస్ నాయకుల చేసిన ఆరోపణలను ఆ కంపెనీ ఖండించింది. ఇందులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాఘవ కన్ స్ట్రక్షన్స్ కు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పింది. ఇది కేవలం మంత్రి వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేందుకు బీఆర్ఎస్ చేస్తున్న కుట్ర అని ఆరోపించింది. శుక్రవారం మానస హిల్స్ లోని కంపెనీ సైట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్ఆర్డీసీ .ఎల్. రోడ్స్ రాఘవ కన్ స్ట్రక్షన్స్ ప్రాజెక్ట్ మేనేజర్ డి. గోపాల కృష్ణ, తిరుమల మెటల్ ఇండస్ట్రీస్ యజమాని కుమార రాజా మాట్లాడారు. 2022-23 లో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే బుద్వేల్‌లో వంద ఎకరాల భూమిని హెచ్ఎండీఏ వేలం వేసిందన్నారు. ఈ వంద ఎకరాల భూమిలో లేఔట్ డెవలప్ మెంట్ పనుల కాంట్రాక్టును హెచ్ఎండీఏ, ఎన్ సీసీ లిమిటెడ్ కంపెనీ కి అప్పగించినట్లు తెలిపారు. ఈ లేఅవుట్ చేస్తున్నప్పుడు బయటపడ్డ రాళ్లను, కోత్వాల్‌గూడలో ఆ కంపెనీ డంప్ చేశారని చెప్పారు. అదే డంప్ మెటీరియల్‌ను ఇప్పుడు క్రషింగ్ చేస్తుంటే, కొత్తగా క్వారీలు తవ్వుతున్నారని అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ డంప్ చేసిన రాళ్లను ఎన్ సీసీ లిమిటెడ్ వారు కూడా, డీకేఆర్ అనే కంపెనీ ద్వారా క్రషింగ్ చేసి హెచ్ఎండీఏ బుద్వేల్ ప్రాజెక్ట్ లో రోడ్ పనులకు వినియోగిస్తున్నారని చెప్పారు. అదే విధానంలో అదే డంప్ చేసిన రాళ్లను తిరుమల మెటల్ ఇండస్ట్రీ క్రష్ చేయగా, ఆ మెటీరియల్ ను రాఘవ కన్సస్ట్రక్షన్స్ తమ రోడ్డు పనుల కోసం కొనుగోలు చేసిందన్నారు. కొన్నేళ్ల నుంచి ఈ ప్రదేశంలో ఎటువంటి బ్లాస్టింగ్ జరగలేదనీ, అలాగే ఎటువంటి మైనింగ్ జరగలేదని వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత, ఈ ప్రాంతంలో ఒక్క కొత్త క్వారీకి అనుమతి ఇవ్వలేదన్నారు. వృథాగా పడి ఉన్న రాళ్లను మాత్రమే క్రషింగ్ చేస్తున్నట్లు చెప్పారు. అది కూడా తిరుమల మెటల్ ఇండస్ట్రీస్ ద్వారానే చేస్తున్నామన్నారు. అంతే తప్ప ఇందులో రాఘవ కన్ స్ట్రక్షన్స్ కు ఎలాంటి సంబంధం లేదన్నారు. రోడ్డు పనులకు సంబంధించి రాఘవ కన్ స్ట్రక్షన్ కు హైదరాబాద్ రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చెల్లించే బిల్లుల్లో, అన్ని ప్రభుత్వ విధి విధానాలను అనుసరిస్తూ ప్రభుత్వం నిర్ణయించిన రాయల్టీని రికవరీ చేస్తామన్నారు. అన్నీ పారదర్శకంగా జరుగుతుంటే 'దొంగతనం' అనడం విడ్డూరంగా ఉందన్నారు. వట్టినాగులపల్లి, కోకాపేట, అనేక ప్రాంతాల్లో ఇదే విధానం లో అనేక క్రషర్లు బీఆర్ఎస్ ప్రభుత్య హయాంలో నుంచి చుట్టూ పక్కల సెల్లారు తవ్వకాలలో వచ్చిన రాళ్లను వినియోగించుకుంటున్నారని వివరించారు. ఆధారాలు లేకుండా తమ కంపెనీ ఇమేజ్‌ను దెబ్బతీసేలా మాట్లాడితే, న్యాయపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.






# తల్లి మరణాన్ని దాచి పెన్షన్ కొట్టేసిన కూతురు..

- హైదరాబాద్‌లో విస్తుగొలిపే ఘటన

**ముద్ర డెస్క్:**

హైదరాబాద్ నగరంలో మానవ సంబంధాలను మంటగలిపే ఒక వింత ఘటన వెలుగులోకి వచ్చింది. కన్నతల్లి మరణించిన విషయాన్ని దాచిపెట్టి, ఆమెకు రావాల్సిన పెన్షన్ డబ్బులను ఏళ్ల తరబడి డ్రా చేస్తూ ఒక కుమార్తె అధికారులను మోసం చేసింది. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ వ్యవహారం ఇప్పుడు స్థానికంగా సంచలనంగా మారింది. ప్రభుత్వ నిధులను అక్రమంగా కాజేయాలనే దురాశతో ఆమె చేసిన పని చూసి పోలీసులు సైతం అవాక్కవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే, రేణుక అనే మహిళ తన తల్లి చనిపోయిన విషయాన్ని ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయకుండా జాగ్రత్త పడింది. టీజీఎస్ పీడీసీఎల్ సంస్థలో పనిచేసి రిటైర్ అయిన తన తల్లి పేరు మీద ప్రతి నెలా జమ అవుతున్న పింఛన్ సొమ్మును ఆమె గుట్టుచప్పుడు కాకుండా విత్ డ్రా చేస్తూ వచ్చింది. ఇలా సుమారు రూ. 6.45 లక్షల రూపాయల వరకు పెన్షన్ డబ్బులను అక్రమంగా డ్రా చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. తనిఖీల్లో భాగంగా అసలు విషయం బయటపడటంతో అధికారులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ మోసంపై టీజీఎస్ పీడీసీఎల్ అధికారులు సీరియస్‌గా స్పందించారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన రేణుకపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆమె ఏయే బ్యాంకుల ద్వారా ఈ సొమ్మును డ్రా చేసింది, ఇందులో ఇంకెవరి ప్రమేయమైనా ఉందా అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. సాధారణంగా పెన్షనర్లు ప్రతి ఏటా తాము బతికే ఉన్నట్లు 'లైఫ్ సర్టిఫికెట్' సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధనను రేణుక ఎలా అధిగమించింది, అధికారుల కళ్లు గప్పి ఇన్నేళ్లుగా ఎలా మభ్యపెట్టిందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనతో అప్రమత్తమైన పింఛన్ విభాగం అధికారులు, తమ రికార్డులను మరోసారి సరిచూసుకునే పనిలో పడ్డారు. త్వరలోనే నిందితురాలిని అదుపులోకి తీసుకుని పూర్తి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు తెలియజేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
07.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఈస్టర్ ఐలాండ్ విగ్రహాల రహస్యం**

పసిఫిక్ సముద్రంలోని ఈస్టర్ దీవిలో భారీ రాతి విగ్రహాలు ఉన్నాయి. వాటిని ఎవరు, ఎలా తయారు చేసి అక్కడికి తీసుకెళ్లారో ఇంకా స్పష్టంగా తెలియదు.



# బొత్సకు మళ్ళీ అస్వస్థత!

**ముద్ర డెస్క్ :**



మాజీ మంత్రి, శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యంతో బాధపడుతూ వారం రోజులపాటు బొత్స హైదరాబాదులో విశ్రాంతి తీసుకున్న సంగతి తెలిసిందే. కోలుకోవడంతో ఈరోజు ఆయన శాసనమండలి సమావేశాలకు హాజరయ్యారు. అయితే సభలో మాట్లాడుతున్న సమయంలో ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అధికారులు వైద్యులను పిలిపించి పరీక్ష చేశారు. బీపీ అధికంగా ఉన్నట్లు గుర్తించారు. బీపీలో హెచ్చుతగ్గుల ఆయన అస్వస్థతకు కారణమని వైద్యులు ధ్రువీకరించారు. విశ్రాంతి అవసరమని చెప్పడంతో.. బొత్స ఇంటికి వెళ్ళిపోయారు. అయితే ఒక్కసారిగా బొత్స అస్వస్థతకు గురికావడంతో శాసనమండలిలో ఒక రకమైన ఆందోళన కనిపించింది.

**తరచూ అస్వస్థత..**

అయితే బొత్స సత్యనారాయణ తరచూ అస్వస్థతకు గురవుతూ వచ్చారు. గతంలో సొంత నియోజకవర్గంలో ప్రభుత్వం పై ఆందోళన కార్యక్రమంలో భాగంగా తూలి పడిపోయారు. అయితే ఇప్పుడు కూడా ఆయన రక్తపోటుతో బాధపడుతున్నారు. ఈరోజు సభలో మాట్లాడుతుండగా ఒక్కసారిగా తూలి పడిపోయారు. పక్కకు పడిపోతున్న తరుణంలో సహచర ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ అప్రమత్తమై ఆయనను పట్టుకున్నారు. అనంతరం వైసిపి వర్గాలు అత్యవసరంగా వైద్యులను రప్పించారు. బొత్స సత్యనారాయణ చాంబర్ లోనే వైద్య పరీక్షలు చేశారు. బీపీలో హెచ్చు తగ్గులే ఆయన అనారోగ్యానికి కారణం అని.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం బొత్స ఇంటికి వెళ్లిపోయారు.

**హైదరాబాదులో చికిత్స..**

ఇటీవల బొత్స సత్యనారాయణ అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. హైదరాబాదు ఆసుపత్రికి తరలించారు. అయితే తరచూ అనారోగ్యానికి గురికావడంతో క్రియాశీలక రాజకీయాలకు ఆయన దూరమవుతారని ప్రచారం నడిచింది. కుటుంబ సభ్యులు సైతం ఆయన స్ట్రెస్ కు గురవుతున్నారని చెప్పి.. క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పించాలని జగన్మోహన్ రెడ్డిని కోరినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఈ వేళ ఉన్నఫలంగా బొత్స హాజరు కావడంతో ఆయన ఆరోగ్యం కుదుటపడినట్లు అంతా భావించారు. ఇంతలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కాగా రేపు శాసనసభ సమావేశాలు చివరి రోజు. చూడాలి బొత్స సభకు హాజరవుతారా? లేదా? అన్నది తెలియనుంది.

# ర్యాప్ సింగర్ టు పీఎం..
## నేపాల్ కాబోయే పీఎం బాలెన్ షా చరిత్ర ఇదీ..

**ముద్ర డెస్క్ :**



నేపాల్ కు బాలెన్ షా ప్రధాన మంత్రి అవుతారా ?. ఇటీవల జరిగిన ఎన్నికల తీరును పరిశీలించినప్పుడు అవుననే సమాధానం వినిపిస్తోంది. ఆయన పార్టీకి భారీ ఎత్తున ఓట్లు పడ్డట్టు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఆయన పార్టీ గెలిస్తే బాలెన్ షా ప్రధాని అవుతారు. ఒక సాధారణ ర్యాప్ సింగర్ .. ప్రముఖ రాజకీయ నేతగా మారడానికి కారణమేంటి ?. ఆయనపై జెన్ జీ యువతకు ఎందుకంత అభిమానం ?. ఆయన చేసిన పనులేంటి అన్నవే ఇప్పుడు హాట్ టాపిక్ .

**పాత, కొత్త తరం రాజకీయాలు**

నేపాల్ రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. నేపాలి కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ లు ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకురాలేకపోయాయి. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, నిరుద్యోగం జెన్ జీ యువతను ఆగ్రహానికి గురిచేశాయి. దీంతో వీధుల్లోకి పోరాటం వచ్చింది. కేపీ శర్మ ఓలీ తన రాజీనామా ప్రకటించారు. దేశవ్యాప్తంగా హింస చెలరేగింది. ఇదంతా ముగిశాక నేపాల్ లో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల ఫలితాలు పూర్తి స్థాయిలో రాకపోయినప్పటికీ.. తదుపరి ప్రధాని బాలెన్ షా అన్న ప్రచారం సాగుతోంది. బాలెన్ షా పూర్తి పేరు బాలేంద్ర షా. మొదట ర్యాప్ సింగర్, ఇంజినీర్.. ఆ తర్వాత ఖాట్మాండు మేయర్. ఇప్పుడు నేపాల్ జాతీయ రాజకీయాల్లో కీలక నేత. బాలెన్ షా రాజకీయ నేతగా రూపాంతరం చెందడానికి కొత్త తరం రాజకీయాలే కారణం. పాతతరం రాజకీయాలతో విసిగిపోయిన జెన్ జీ యువత బాలెన్ షాకు మద్దతు ఇస్తోంది. అందుకే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన పార్టీ జెన్ జీ నుంచి గణనీయమైన మద్దతు సాధించినట్టు తెలుస్తోంది.

**బాలెన్ షా ప్రత్యేకత..**

బాలెన్ షా తన ప్రస్థానం ర్యాప్ సింగర్ గా, స్ట్రక్చరల్ ఇంజినీర్ గా ప్రారంభించారు. ర్యాప్ సింగర్ గా ఆయన పాటలు అవినీతి, రాజకీయ వైఫల్యాలు, యువత సమస్యలపైన ఉంటాయి. ఇవే యువతలో ఆయన పట్ల క్రేజ్ పెంచాయి. సోషల్ మీడియా ద్వారా ప్రజలతో నేరుగా మాట్లాడటంతో జెన్ జీ యువతతో బాలెన్ షాకు కనెక్టివిటీ పెరిగింది. ఆ తర్వాత ఖట్మాండు మేయర్ గా స్వతంత్ర అభ్యర్థిగా గెలిచారు. గెలిచిన తర్వాత ఆయన తీసుకున్న నిర్ణయాలు జెన్ జీ యూత్ ను మరింత ఆకర్షించాయి. తమ సమస్యలకు పరిష్కారం చూపే నాయకుడిగా జెన్ జీ యువత బాలెన్ షాను నమ్మడం మొదలు పెట్టింది. ముఖ్యంగా అక్రమ నిర్మాణాలు కూల్చడం, ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో చొరవ, నగర నిర్వహణ, అవినీతి అధికారులపై కఠిన చర్యలు.. బాలెన్ షా అంటే మాటలు చెప్పే నాయకుడు కాదు, చేతల ద్వారా చూపే నాయకుడన్న అభిప్రాయం కలిగించాయి. అప్పటి వరకు ఉన్న కాంగ్రెస్, కమ్యూనిస్టులకు ప్రత్యామ్నాయంగా కనిపించాడు. అదే జెన్ జీ యూత్ లో బాలెన్ షా ఆకర్షణను పెంచింది.

**పెద్ద పార్టీ కాదు..**

బాలెన్ షా రాష్ట్రీయ స్వతంత్ర పార్టీని స్థాపించారు. ఎన్నికల్లో పోటీ చేశారు. అప్పటి వరకు బాలెన్ షా పార్టీ పెద్ద పార్టీ కాదు. కానీ ఇప్పుడు నేపాలి కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ తో కలిపి మాట్లాడుతున్నారు. ఎన్నికల్లో గట్టి ఓటు బ్యాంకు సాధించిందన్న వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఇటీవల జరిగిన ఎన్నికల్లో దాదాపు 10 లక్షల కొత్త జెన్ జీ యువత ఓట్లు కలవడం బాలెన్ షాకు కలిసొచ్చినట్టు తెలుస్తోంది. బాలెన్ షా ఎదుగుదల వెనుక కాంగ్రెస్, కమ్యూనిస్టుల వైఫల్యమే కారణం అన్న విశ్లేషణ ఉంది. ఎందుకంటే ఈ రెండు పార్టీలు ప్రజల సమస్యలను తీర్చలేకపోయాయి. పైగా వారి హాయంలో జరిగిన అవినీతి, ఆశ్రిత పక్షపాతం దేశ ప్రజల్ని, ముఖ్యంగా జెన్ జీ యువతను తీవ్ర ప్రభావితం చేశాయి. అందుకే బాలెన్ షా ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా కనిపించారు.

# పన్ను ఎగవేతదారులపై కొరడా

- మొండిబకాయిల వసూళ్లపై జీహెచ్ఎంసీ కఠిన చర్యలు
- ముందుగా రెడ్ నోటీసులు ఇచ్చి వసూళ్లు
- స్పందించకపోతే ఆస్తులు సీజ్
- జాబితా సిద్ధం చేసిన అధికారులు
- రూ. 3 వేల కోట్లలో రూ. వెయ్యి కోట్లు బకాయిలు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

జీహెచ్ఎంసీలో పన్ను ఎగవేతదారుల భరతం పట్టేందుకు అధికారులు సిద్ధం అయ్యారు. గత కొన్నేళ్లుగా ఆస్తి పన్ను కట్టకుండా ఉన్నవారి జాబితాను సిద్ధం చేశారు. పెండింగ్ బకాయిలను వసూలు చేసేందుకు అధికారులు నిర్దేశించుకున్న టార్గెట్ చేరుకోలేకపోవడంతో.. వాటిని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఏళ్ల తరబడి ప్రాపర్టీ ట్యాక్స్‌లు చెల్లించకుండా ఉన్నవారిని గుర్తించి.. వారి ఆస్తులను సీజ్ చేయాలని నిర్ణయించుకున్న అధికారులు.. వారి వివరాలను ఉన్నతాధికారులకు వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ను విభజించి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎన్‌సీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎన్‌సీ) కార్పొరేషన్లుగా ఏర్పాటు చేశారు. అయితే ఈ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో నగరవాసులకు అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు.. జీహెచ్ఎంసీ విభజన నేపథ్యంలో మూడు కార్పొరేషన్లపై రుణభారం పడకుండా రూ.4780 కోట్ల అప్పులను రాష్ట్ర ప్రభుత్వమే టేకోవర్ చేయనుంది. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ పరిధిలో ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలు గత కొన్నేళ్లుగా భారీగా పేరుకుపోతుండటంతో.. ఖజానాకు ఆశించిన మేర వసూళ్లు రావడం లేదు.

**లక్ష్యానికి దూరంగా వసూళ్లు..**

పాత జీహెచ్ఎంసీ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లకు అధికారులు ఏటా టార్గెట్ పెట్టుకుని మరీ వసూళ్లు చేస్తున్నా.. లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. దీంతో రూ.వందల కోట్ల బకాయిలు కొండల్లా పేరుకుపోయాయి. జీహెచ్ఎంసీకి డబ్బు తీసుకొచ్చే ప్రధాన ఆర్థిక వనరు అయిన ఆస్తి పన్ను రాకపోవడంతో.. అది అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలోనే త్వరలోనే 20252026 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న వేళ.. వీలైనన్ని ఎక్కువ బకాయిలను వసూలు చేయడంపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఏళ్లుగా ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించకుండా భారీగా బకాయిలు పేరుకుపోయిన వారి జాబితాను రెడీ చేసి.. వారి ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు అధికారులు సిద్ధం అయ్యారు. సాధారణంగా వసూలు చేస్తున్న ఈ ఆస్తి పన్ను బకాయిల వసూళ్లతో ఈ ఆర్థిక ఏడాదిలో 3 కార్పొరేషన్లపై కలిపి ఇప్పటివరకు మొత్తంగా రూ.2 వేల కోట్లకు పైగా వసూలు అయ్యాయి. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3 వేల కోట్లు వసూలు చేయాలని అధికారులు పెట్టుకున్న లక్ష్యానికి ఇంకో రూ.1000 కోట్లు మిగిలి ఉండగా.. ఆ మొత్తాన్ని మార్చి 31వ తేదీ లోపు వసూలు చేయాలని అధికారులు వ్యూహాలు సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే సంవత్సరాల తరబడి ఆస్తి పన్ను ఎగవేస్తూ.. రూ. కోట్లల్లో పేరుకుపోయిన బడా వ్యాపారులు, బడా సంస్థలపై ఉక్కుపాదం మోపేందుకు జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధం అయ్యారు.

**మొండి బకాయిదారుల జాబితా రెడీ..**

ఎన్నో ఏళ్లుగా ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించకుండా తప్పించుకుంటున్న కార్పొరేట్ సంస్థలు, హోటళ్లు, రియల్ ఎస్టేట్ బిజినెస్‌మెన్‌ల లిస్ట్ రెడీ చేశారు. ఇప్పటికే నగరంలో పలు ప్రాంతాల్లో ఆస్తి పన్ను అధికంగా ఉన్న ఆస్తులను సీజ్ చేస్తున్నారు. జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ వంటి నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఉన్న ప్రముఖ కమర్షియల్ ప్రాపర్టీల ఓనర్లే ఈ ఎగవేతదారుల లిస్ట్‌లో టాప్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా కేవలం కమర్షియల్ ఆస్తుల నుంచే జీహెచ్ఎంసీకి దాదాపు రూ.1000 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తోంది.

**పన్ను ఎగవేతదారులకు రెడ్ నోటీసులు..**

ఇక ఆస్తులు సీజ్ చేసే ముందు చివరి హెచ్చరికలో భాగంగా ఆస్తి పన్ను ఎగవేతదారులకు ప్రత్యేకంగా రెడ్ నోటీసులు జారీ చేసేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ఆ నోటీసులు ఇచ్చినప్పటికీ పన్ను చెల్లించకపోతే.. జీహెచ్ఎంసీ యాక్ట్‌లోని సెక్షన్ 269 కింద వారిపై డిస్ట్రెస్ వారెంట్లు జారీ చేసి.. వారి ఆస్తులను, షాపులను సీజ్ చేయడంతో పాటు.. వాహనాలను కూడా జప్తు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మరోవైపు.. గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన మొండి బకాయిలు చెల్లిస్తే.. వాటిని ప్రస్తుతం అమలు చేస్తున్న వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం కింద చెల్లిస్తే.. వడ్డీలో సుమారు 90 శాతం మినహాయింపు కల్పించనున్నారు. ఈ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుండటంతో అధికారులు దాన్ని మరింత ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 31వ తేదీ లోపు బకాయిలు చెల్లించని వారికి ఏప్రిల్ 1వ తేదీ నుంచి ముందుగా పన్ను చెల్లించే వారికి ఎర్లీ బర్డ్ స్కీమ్ ద్వారా 5 శాతం రాయితీని ఇవ్వనున్నారు. అదే సమయంలో మొండి బకాయిల వసూళ్ల కోసం ఆస్తులు జప్తు చేసుకునే ప్రక్రియను కూడా కొనసాగిస్తామని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**




ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులకు ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు నారాయణరెడ్డి, మను చౌదరి, దీపక్ తివారి, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్లు వినయ్ కుమార్ రెడ్డి, సృజన ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు మంచి పేరు వస్తుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఐటీ పరిశ్రమలు వాణిజ్య శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 99 రోజుల పాటు చేపడుతున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి, అమలు కాని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ 99 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో 10 అంశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రజల వద్దకే వెళ్తున్నారని తెలిపారు. ఇప్పటికీ రేషన్ కార్డులు లేని వారు, ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్లు కేటాయించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చే దిశగా పనిచేస్తామన్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించామని చెప్పారు. జిల్లా స్థాయిలో అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం కొనసాగుతోందని తెలిపారు. అనంతగిరి ఈకో పార్క్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. హౌసింగ్ పథకం ద్వారా ఇండ్ల నిర్మాణాలకు సంబంధించిన చెల్లింపులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలోని 106 గురుకుల పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా, మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ అవగాహన సమావేశంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, శంకరయ్య, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాపుల్లో చీలిక..
## వైసీపీకి సాధ్యమయ్యేనా?

**ముద్ర డెస్క్ :**

ఏపీలో కుల రాజకీయం నిత్యం రావణకాష్టంలా రగులుతూనే ఉంటుంది. అలా ఉంటేనే రాజకీయ లబ్ధి చేకూరే అవకాశం ఉంది. అయితే ఇప్పుడు ఏపీలో కాపుల చుట్టూ రాజకీయం నడుస్తోంది. ఇందులో విశేషం ఏమిటంటే.. అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ కాపు కులం గురించి పట్టించుకోని నేతలు.. ఇప్పుడు అదే కాపు రాజకీయాన్ని రగిల్చి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి విజయం కోసం.. అదే కాపులను చీల్చే ప్రయత్నం చేస్తున్నారు. అలా కాపులను చీల్చితేనే అధికారం దక్కుతుందని భావిస్తున్నారు. ఇప్పుడు వైసీపీ కాపు నేతలకు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన టాస్క్ అదే. మొన్నటి ఎన్నికల్లో కాపులను వదులుకొని ఎంత తప్పు చేశానో అని జగన్మోహన్ రెడ్డి బాధపడుతున్నారు. ఇప్పుడు వారిని చీల్చడమే పనిగా పెట్టుకున్నారు.

**నిర్మోహమాట కామెంట్స్..**

తాను ఎప్పుడూ కాపుల రాజకీయం చేయలేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు చాలా సందర్భాల్లో చెప్పారు. నాకు కుల భావన లేదని కూడా తేల్చి చెప్పారు. తనకు కాపులు ఓట్లు వేయలేదని కూడా అన్నారు. అసలు కాపులతో తనకు పని లేదన్నట్టు మాట్లాడారు. ఇప్పుడు నడిరోడ్డుపై పోలీసులు, మీడియా సమక్షంలో సీఎం చంద్రబాబును తిట్టారు అంబటి. దానిపై కేసులు నమోదయి జైలుకు వెళ్తే.. తాను కాపును కాబట్టే తనను అరెస్టు చేశారంటూ చెప్పుకొచ్చారు. ఒక వంగవీటి మోహన్ రంగా, ఒక మెగాస్టార్ చిరంజీవి, ఒక ముద్రగడ పద్మనాభం అంటూ అంబటి రాంబాబును ఆకాశానికి ఎత్తేసారు. జగన్మోహన్ రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి ఏకంగా కాపు టైగర్ ను చేసేసారు.

**తీరిన కాపుల ఆశ..**

దశాబ్దాలుగా కాపులు కోరుకున్న మాదిరిగా రాజ్యాధికారానికి దగ్గరగా వచ్చారు. అది కూడా పవన్ కళ్యాణ్ ద్వారా. ముఖ్యమంత్రికి కూతవేటు దూరంలో.. డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఆయన మాట ప్రభుత్వపరంగానూ, రాజకీయంగానూ చెల్లుబాటు అవుతోంది. కూటమిలో అధికారం దక్కుతోంది. ఎనలేని ప్రాధాన్యం కూడా ఇస్తున్నారు. ఇటువంటి సమయంలో కాపులు ఏకతాటి పైకి వచ్చి పవన్ కళ్యాణ్ వెంట అడుగులు వేస్తున్నారు. అందుకే ఇప్పుడు కాపుల్లో చీలిక తెచ్చి.. కొంత ఓటు బ్యాంకును జగన్ పాదాల చెంతకు చేర్చాలన్న ఆలోచనలో వైసిపి కాపు నేతలు ఉన్నారు. కానీ అది అంత సులువుగా కాదు. గత అనుభవాలను రంగరించుకొని మరి కాపులకు అన్ని విషయాలు తెలుసు. ఈసారి అంత సులువుగా మోసపోరని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

# ఇరాన్ ఖతం.. ఇక టార్గెట్ క్యూబా..!

- అంతు చూస్తామని ట్రంప్ హెచ్చరిక

**ముద్ర డెస్క్ :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేసి అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చకు దారితీశారు. ఇరాన్‌పై అమెరికా చేసిన చర్యల వల్ల ఆ దేశ నావికాదళాన్ని పూర్తిగా నాశనం చేశామని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ ఇప్పుడు ఒత్తిడికి తట్టుకోలేక చర్చలకు సిద్ధమైందని, అక్కడి అధికారులు కాళ్లబేరానికి వచ్చారని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో జరిగిన ఉద్రిక్తతలు ఇంకా పూర్తిగా ముగియలేదని, అవసరమైతే మరిన్ని కఠిన చర్యలు తీసుకోవడానికి అమెరికా సిద్ధంగా ఉందని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, అమెరికా భద్రతకు ముప్పుగా భావించే ఇతర దేశాలపై కూడా కఠిన వైఖరి కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో క్యూబాపై కూడా అమెరికా దృష్టి సారించవచ్చని ట్రంప్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. అవసరమైతే క్యూబాపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించడం గమనార్హం. ట్రంప్ వ్యాఖ్యలు అంతర్జాతీయ వేదికపై మరోసారి ఉద్రిక్తతలను పెంచేలా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కేపీహెచ్‌బీలో వివాహిత అదృశ్యం

**ముద్ర కూకట్‌పల్లి :**



ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఓ వివాహిత అదృశ్యమైన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కెపిహెచ్బి ఫేజ్ 6లోని భావన రెసిడెన్సీలో యార్లగడ్డ రామ్ చంద్రకాంత్ తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. శుక్రవారం ఉదయం 8:30 గంటల సమయంలో ఆయన పని నిమిత్తం బయటకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత ఆయన కుమార్తె ఫోన్ చేసి, తల్లి మాగంటి ప్రవళిక (37) ఇంట్లో మొబైల్ ఫోన్ వదిలేసి ఎక్కడికో వెళ్ళిపోయిందని సమాచారం అందించింది. వెంటనే ఇంటికి చేరుకున్న చంద్రకాంత్ అపార్ట్‌మెంట్ సిసిటివి ఫుటేజీని పరిశీలించగా, ప్రవళిక ఒక క్యాబ్‌లో ఎక్కి వెళ్లినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి. అవినాష్ బాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 07.03.2026
www.mudranews.in | @mudranews



**డ్యాట్‌లోవ్ పాస్**

సంఘటన1959లో రష్యాలో 9 మంది ట్రెక్కర్లు అనుమానాస్పదంగా మరణించారు. వారి మరణానికి నిజమైన కారణం ఇప్పటికీ చర్చలలోనే ఉంది.





## ‘అంత దూకుడు అవసరమా?’
### అభిషేక్ శర్మపై అశ్విన్ అసహనం..

టీ20 ప్రపంచకప్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. టోర్నీలో ఇప్పటివరకు అతడు నమోదు చేసిన స్కోర్లు 0, 0, 0, 15, 55, 10, 9గా ఉన్నాయి. లీగ్ దశలో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ అయినప్పటికీ జట్టు మేనేజ్‌మెంట్ అతడిని ఓపెనర్‌గా కొనసాగించింది. అయినా కీలక మ్యాచ్‌ల్లో అతడి ఆటలో పెద్ద మార్పు కనిపించలేదు. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీ ఫైనల్లో కూడా అభిషేక్ త్వరగా వికెట్ కోల్పోయాడు. కేవలం 9 పరుగులు మాత్రమే చేసి అవుట్ కావడంతో అతడి ఆటతీరుపై విమర్శలు మొదలయ్యాయి. మరోవైపు ఓపెనర్ సంజూ శాంసన్ మాత్రం అద్భుతంగా ఆడుతూ 42 బంతుల్లో 89 పరుగులు చేసి జట్టు విజయానికి ప్రధాన కారణంగా నిలిచాడు. ఈ నేపథ్యంలో భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిషేక్ బ్యాటింగ్‌పై విమర్శలు చేశారు. ఇంగ్లండ్ మ్యాచ్‌లో అతడు చాలా తొందరపడ్డాడని పేర్కొన్నారు. విల్ జాక్స్ బౌలింగ్‌లో కొన్ని పరుగులు వచ్చిన తర్వాత కూడా అదే ఓవర్లో భారీ షాట్లు కొట్టాలని ప్రయత్నించడం తప్పని అన్నారు. కొన్నిసార్లు ఓపికగా ఆడటం కూడా అవసరమని, సింగిల్ తీసుకుని మరో ఎండ్‌కు వెళ్లి మళ్లీ అవకాశం కోసం ఎదురుచూడాల్సిందని సూచించారు. అశ్విన్ మాటల్లో, అభిషేక్ మంచి ప్రతిభ ఉన్న ఆటగాడే అయినప్పటికీ ప్రస్తుతం ఒత్తిడిలో ఉన్నట్లు కనిపిస్తున్నాడని చెప్పారు. కెప్టెన్ మరియు కోచ్ అతడితో మాట్లాడి పరిస్థితిని అర్థం చేసుకునేలా చేయాలని సూచించారు. అతడిపై అదనపు ఒత్తిడి పెంచకుండా మానసికంగా బలంగా తయారయ్యేలా మేనేజ్‌మెంట్ సహకరించాలని అన్నారు. ఇదిలా ఉంటే మార్చి 8న భారత్–న్యూజిలాండ్ మధ్య టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ జరగనుంది. ఈ కీలక మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఎలా రాణిస్తాడన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### బుమ్రా ప్రపంచంలోనే టాప్ బౌలర్
## అభిషేక్ ఫైనల్‌లో రాణిస్తాడు



టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌పై విజయం సాధించి భారత్ ఫైనల్‌కు చేరడంలో సంజు శాంసన్, జస్‌ప్రీత్ బుమ్రా కీలక పాత్ర పోషించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్‌కు సంజు శాంసన్ దూకుడైన ఇన్నింగ్స్ ఆడి భారీ స్కోరు అందించాడు. అనంతరం లక్ష్యాన్ని ఛేదించేందుకు వచ్చిన ఇంగ్లాండ్ జట్టుపై బుమ్రా కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఒత్తిడి తెచ్చి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. మరోవైపు ఓపెనర్ అభిషేక్ శర్మ మాత్రం ఈ మ్యాచ్‌లో కూడా ఆశించిన స్థాయిలో రాణించ లేక పోయాడు. ఈ ముగ్గురు ఆటగాళ్ల ప్రదర్శనపై మాజీ భారత కెప్టెన్ కపిల్ దేవ్ స్పందించాడు.


బుమ్రా గురించి మాట్లాడిన కపిల్ దేవ్ అతడిని ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్‌గా అభివర్ణించాడు. కీలక సమయాల్లో కూడా ప్రశాంతంగా బౌలింగ్ చేసి జట్టుకు విజయాలు అందించే సామర్థ్యం బుమ్రాకు ఉందని తెలిపాడు. తీవ్రమైన ఒత్తిడిలో కూడా తన నైపుణ్యాన్ని చూపించి మ్యాచ్ గమనాన్ని మార్చగలడు అని పేర్కొన్నాడు. దేశవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానుల ప్రేమ, గౌరవానికి బుమ్రా అర్హుడని అభిప్రాయపడ్డాడు.

సంజు శాంసన్ గురించి మాట్లాడుతూ అతడు అత్యంత ప్రతిభావంతమైన క్రికెటర్ అని కపిల్ చెప్పాడు. ప్రతి ఆటగాడి కెరీర్‌లో కొన్ని కష్టకాలాలు రావడం సహజమని, వాటిని అధిగమించి ముందుకు సాగితేనే అసలు ప్రతిభ బయటపడుతుందని తెలిపాడు. ఇటీవల జరిగిన రెండు మ్యాచ్‌ల్లో సంజు చూపించిన అద్భుతమైన బ్యాటింగ్ అతడి ఫామ్ తిరిగి వచ్చినట్టు చూపిస్తోందని పేర్కొన్నాడు.

అభిషేక్ శర్మ ప్రస్తుతం ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడని కపిల్ అభిప్రాయపడ్డాడు. అయితే సంజు లాగా అతడూ త్వరలోనే తన ఫామ్‌ను తిరిగి అందుకుంటాడని విశ్వాసం వ్యక్తం చేశాడు. ఫైనల్ మ్యాచ్‌లో అతడు మెరుగైన ప్రదర్శన చేయగలడని ఆశాభావం వ్యక్తం చేశాడు.

క్రికెట్ అనేది వ్యక్తిగత ఆట కాదని, జట్టు ఆట అని కపిల్ గుర్తుచేశాడు. ఒక ఆటగాడు రాణించడం ముఖ్యమే కానీ జట్టుగా కలిసి విజయం సాధించడం మరింత ముఖ్యమని చెప్పాడు. ప్రస్తుతం టీమ్ ఇండియా అదే దిశగా ముందుకు సాగుతోందని, ఫైనల్ మ్యాచ్‌లో కూడా అదే ఉత్సాహంతో ఆడి ట్రోఫీ గెలవాలని ఆకాంక్షించాడు

### భారత్–న్యూజిలాండ్ ఫైనల్‌కు
# అంపైర్లు ఖరారు..
### టీమిండియా అభిమానుల్లో సెంటిమెంట్ టెన్షన్







టీ20 ప్రపంచకప్–2026 టోర్నమెంట్ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే రెండు సెమీ ఫైనల్స్ ముగియడంతో టైటిల్ పోరుకు అర్హత సాధించిన జట్లు ఖరారయ్యాయి. తొలి సెమీ ఫైనల్లో సౌతాఫ్రికాపై న్యూజిలాండ్ విజయం సాధించగా, రెండో సెమీస్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించి భారత్ ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. దీంతో క్రికెట్ అభిమానుల దృష్టంతా ఇప్పుడు భారత్–న్యూజిలాండ్ మధ్య జరిగే మహా ఫైనల్‌పైనే ఉంది. ఈ ప్రతిష్టాత్మక ఫైనల్ మ్యాచ్ మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో నిర్వహించనున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంగా గుర్తింపు పొందిన ఈ వేదికపై జరిగే ఈ మ్యాచ్‌కు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఫైనల్‌కు బాధ్యతలు నిర్వర్తించే అధికారుల జాబితాను ప్రకటించింది.ఐసీసీ వెల్లడించిన వివరాల ప్రకారం ఫీల్డ్ అంపైర్లుగా రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ మరియు అలెక్స్ వార్ఫ్ వ్యవహరించనున్నారు. ఈ ఇద్దరు అంపైర్లు ఇటీవల జరిగిన సౌతాఫ్రికా–న్యూజిలాండ్ సెమీ ఫైనల్‌కు కూడా బాధ్యతలు నిర్వర్తించారు. అంతర్జాతీయ మ్యాచ్‌లలో అనుభవం కలిగిన ఈ ఇద్దరిపై ఐసీసీ మరోసారి విశ్వాసం ఉంచింది. ఇక థర్డ్ అంపైర్‌గా అల్లాఉద్దీన్ పలేకర్‌ను నియమించగా, ఫోర్త్ అంపైర్‌గా అడ్రియన్ హోల్డ్‌స్టక్ పని చేయనున్నారు. మ్యాచ్ రిఫరీగా ఆండీ పైక్రాఫ్ట్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇదిలా ఉంటే రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్‌కు ఐసీసీ టోర్నీల ఫైనల్స్‌లో అంపైరింగ్ చేసిన మంచి అనుభవం ఉంది. 2023 వన్డే వరల్డ్‌కప్, 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్స్‌లో కూడా ఆయనే అంపైర్‌గా వ్యవహరించారు. అయితే ఇందులో ఒక ఆసక్తికరమైన విషయం అభిమానుల్లో చర్చకు దారి తీస్తోంది. 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ కూడా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలోనే జరిగింది. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమి పాలై ట్రోఫీ చేజార్చుకుంది. ఆ ఫైనల్‌లో కూడా ఇల్లింగ్‌వర్త్ అంపైర్‌గా ఉన్నారు. ఇప్పుడు మళ్లీ అదే వేదికపై, అదే అంపైర్‌తో ఫైనల్ జరుగుతుండటంతో కొంతమంది అభిమానులు సెంటిమెంట్‌గా భావిస్తున్నారు. అయితే మరోవైపు 2024 టీ20 ప్రపంచకప్‌లో సౌతాఫ్రి కాను, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో న్యూజిలాండ్‌ను ఓడించి భారత్ టైటిల్ గెలుచుకుంది. అందువల్ల ఈసారి కూడా అదే విజయాన్ని పునరావృతం చేయాలని అభిమానులు ఆశిస్తున్నారు. మొత్తానికి భారత్–న్యూజిలాండ్ మధ్య జరగబోయే ఈ ఫైనల్ మ్యాచ్‌పై ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల్లో భారీ ఉత్కంఠ నెలకొంది. ఇప్పుడు అందరి దృష్టి అహ్మదాబాద్‌లో జరిగే ఆ మహా పోరుపైనే ఉంది.

# వరల్డ్ కప్‌లో అనవసర హంగులు వద్దు..
### నిర్వాహకులపై సునీల్ గావస్కర్ ఆగ్రహం



టీ20 ప్రపంచకప్ సందర్భంగా మ్యాచ్‌ల మధ్య జరుగుతున్న వినోద కార్యక్రమాలపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. మ్యాచ్ జరుగుతున్న సమయంలో డీజే సౌండ్స్, లేజర్ షోలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆటగాళ్ల ఏకాగ్రతను దెబ్బతీస్తుందని విమర్శించాడు. నిర్వాహకులు గతంలో చేసిన పొరపాట్లనే మళ్లీ చేయడం సరైంది కాదని పేర్కొన్నాడు. సెమీ ఫైనల్లో భారత్ – ఇంగ్లాండ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో ఇంగ్లాండ్ బ్యాటర్ బెతెల్ క్రీజులో ఉండగా, బౌలింగ్‌కు సిద్ధమైన జస్‌ప్రీత్ బుమ్రాను ప్రోత్సహించేందుకు స్టేడియంలో ‘బూమ్ బూమ్ బుమ్రా’ అంటూ డీజే సౌండ్స్‌ను గట్టిగా ప్లే చేశారు. బౌలర్ బంతి వేయడానికి సిద్ధమవుతున్న సమయంలో ఇలా చేయడం ఆటపై ప్రభావం చూపే అవకాశం ఉందని గావస్కర్ వ్యాఖ్యానించాడు. ప్రేక్షకుల ఉత్సాహాన్ని పెంచే ప్రయత్నం చేసినా, మ్యాచ్ మధ్యలో ఇలాంటి హంగులు అవసరం లేదని అభిప్రాయపడ్డాడు. ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీలో ఆటగాళ్ల ఏకాగ్రత దెబ్బతినే పరిస్థితి రాకూడదని చెప్పాడు. బౌలర్ బంతి వేయబోతున్న సమయంలో భారీ సౌండ్స్ వినిపిస్తే ఆటగాళ్ల దృష్టి చెదరిపోవచ్చు అని తెలిపాడు. ఇదే తరహా సంఘటన గతంలో కూడా జరిగిందని గుర్తు చేశాడు. వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో లేజర్ షో ఏర్పాటు చేశారని, దాదాపు రెండున్నర నిమిషాల పాటు సాగిన ఆ కార్యక్రమం ఆటగాళ్లకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని వివరించాడు. ఎక్కువ లైటింగ్ చూసిన తర్వాత కొంతసేపు మైదానంలో చీకటి అనిపించే పరిస్థితి వస్తుందని చెప్పాడు. ఇలాంటి వినోద కార్యక్రమాలు చేయాలనుకుంటే ఐపీఎల్ వంటి లీగ్ టోర్నీల్లో నిర్వహించుకోవాలని సూచించాడు. ప్రపంచకప్‌లో ముఖ్యంగా నాకౌట్ మ్యాచ్‌ల సమయంలో మాత్రం ఇలాంటి కార్యక్రమాలు ఉండకూడదని స్పష్టం చేశాడు

# పింక్ బాల్ టెస్టు: తొలి రోజు ఆసీస్ 97/3





పెర్త్ వేదికగా జరుగుతున్న డే–నైట్ పింక్ బాల్ టెస్టులో ఆస్ట్రేలియా మహిళల జట్టు మరియు భారత మహిళల జట్టు మధ్య ఆసక్తికర పోరు కొనసాగుతోంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా మూడు వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజులో ఎలీస్ పెర్రీ 43 పరుగులతో అజేయంగా ఉండగా, అన్నాబెల్ సదర్లాండ్ 20 పరుగులతో ఆమెకు తోడుగా నిలిచింది. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఆరంభంలోనే భారత బౌలర్లు ప్రభావం చూపించారు. ఓపెనర్లు జార్జియా వోల్ కేవలం 2 పరుగులకే అవుట్ కాగా, ఫోయబ్ లిట్చ్‌ఫీల్డ్ 9 పరుగులు చేసి నిరాశపరిచింది. కెప్టెన్ అలిసా హీలే కూడా 13 పరుగులకే పెవిలియన్ చేరింది. భారత బౌలర్లలో సయాలి రెండు వికెట్లు పడగొట్టగా, క్రాంతి గౌడ్ ఒక వికెట్ సాధించింది. హీలే ఇచ్చిన క్యాచ్‌ను జెమీమా రోడ్రిగ్స్ అద్భుతంగా అందుకోవడం మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇదిలా ఉంటే అంతకు ముందు భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకు ఆలౌటైంది. దీంతో ప్రస్తుతం ఆస్ట్రేలియా ఇంకా 102 పరుగులు వెనుకబడి ఉంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓపెనర్ స్మృతి మందాన కేవలం 4 పరుగులకే అవుట్ అయింది. మరో ఓపెనర్ షెఫాలీ వర్మ 35 పరుగులు చేసి కొంతసేపు జట్టును నిలబెట్టింది. ప్రతీకా రావల్ 18 పరుగులు చేసింది. అయితే ఈ ఇద్దరూ తక్కువ వ్యవధిలోనే అవుట్ కావడంతో భారత ఇన్నింగ్స్ ఒత్తిడిలో పడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 19 పరుగులు చేసి ఔట్ కాగా, దీప్తి శర్మ 7, రిచా ఘోష్ 11, స్నేహ్ రాణా 5 పరుగులతో పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఈ పరిస్థితుల్లో జెమీమా రోడ్రిగ్స్ మాత్రం నిలకడగా బ్యాటింగ్ చేస్తూ జట్టును ముందుకు నడిపించింది. ఆమె 52 పరుగులు చేసి టెస్టు కెరీర్‌లో నాలుగో అర్ధసెంచరీని నమోదు చేసింది. చివర్లో కాశ్వీ గౌతమ్ 34 పరుగులతో అజేయంగా నిలిచి స్కోరును కొంతమేర పెంచింది. ఆస్ట్రేలియా బౌలర్లలో అన్నాబెల్ సదర్లాండ్ అద్భుతంగా బౌలింగ్ చేసి 4 వికెట్లు పడగొట్టింది. అలిస్ హమిల్టన్ మూడు వికెట్లు తీసుకోగా, బ్రౌన్ రెండు వికెట్లు సాధించింది. గార్డెనర్ ఒక వికెట్ తన ఖాతాలో వేసుకుంది. మొత్తంగా చూస్తే తొలి రోజు ఆటలో ఇరు జట్లు సమానంగా పోటీ పడినట్లు కనిపిస్తోంది. రెండో రోజు మ్యాచ్ ఎలా మలుపు తిరుగుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది.



### ఫైనల్‌లో అభిషేక్‌కు అవకాశం ఇవ్వాలి: రవిశాస్త్రి

టీ20 ప్రపంచకప్ 2026లో అభిషేక్ శర్మ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్లో అతడు కేవలం 9 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. మొత్తం టోర్నీలో ఇప్పటివరకు 7 మ్యాచ్‌ల్లో 89 పరుగులే చేశాడు. జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో మాత్రమే హాఫ్ సెంచరీ సాధించాడు. అయినా ఫైనల్‌లో అతడిని జట్టులో కొనసాగించాలని మాజీ కోచ్ రవిశాస్త్రి సూచించాడు. ఫైనల్ మ్యాచ్ ముందు జట్టులో మార్పులు చేయాల్సిన అవసరం లేదని తెలిపాడు. అభిషేక్ తన సామర్థ్యంపై నమ్మకం ఉంచుకుని ధైర్యంగా ఆడాలని చెప్పాలని అభిప్రాయపడ్డాడు. ఫైనల్‌లో అతడు తిరిగి ఫామ్‌లోకి వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఇక సంజు శాంసన్ గురించి మాట్లాడిన రవిశాస్త్రి, అతడు మళ్లీ మంచి రిథమ్‌లోకి వచ్చాడని అన్నాడు. వెస్టిండీస్, ఇంగ్లాండ్‌పై కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో ముఖ్య పాత్ర పోషించాడని చెప్పాడు. ప్రస్తుతం సంజు షాట్ సెలక్షన్ విషయంలో మరింత జాగ్రత్తగా ఆడుతున్నాడని, మానసికంగా కూడా బలంగా కనిపిస్తున్నాడని విశ్లేషించాడు.

### అతనికి ఫైనల్‌లోనే అవకాశం ఇవ్వాలి

ముంబయిలోని వాంఖడే స్టేడియంలో జరిగిన టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌లో భారత్–ఇంగ్లాండ్ మ్యాచ్‌లో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. నాలుగు ఓవర్లు వేసిన అతడు 64 పరుగులు ఇచ్చి ఒక వికెట్ మాత్రమే తీసుకున్నాడు. ఈ ప్రదర్శన తర్వాత అతడి ఆటతీరుపై చర్చలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ స్పందించాడు. వరుణ్ చక్రవర్తిలో ప్రస్తుతం ఆత్మవిశ్వాసం కొంత తగ్గినట్లు కనిపిస్తోందని అన్నాడు. అయితే అతడిని జట్టులో నుంచి తప్పించడం కంటే ఫైనల్‌లోనే మళ్లీ అవకాశం ఇవ్వాలని సూచించాడు. భారత్ ఫైనల్‌లో న్యూజిలాండ్‌తో తలపడబోతున్న నేపథ్యంలో జట్టు ప్రణాళికలు స్పష్టంగా ఉండాలని పఠాన్ పేర్కొన్నాడు. వరుణ్‌ను మళ్లీ సరైన మానసిక స్థితిలోకి తీసుకురావడం చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డాడు. తాను జట్టు శిబిరంలో ఉంటే ఈ రెండు రోజులు వరుణ్‌ను అన్ని విషయాల నుంచి దూరంగా ఉంచేవాడినని పఠాన్ చెప్పాడు. ఎక్కువమంది మాట్లాడకుండా చూసి, అతడు ప్రశాంతమైన మనసుతో మైదానంలోకి దిగేలా చూసేవాడినని తెలిపాడు. ఒక రోజు ప్రాక్టీస్ చేయడం కంటే మానసికంగా రిఫ్రెష్ కావడం అతడికి ఎక్కువ ఉపయోగం చేస్తుందని అన్నాడు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం భారత్–న్యూజిలాండ్ మధ్య టీ20 ప్రపంచకప్ ఫైనల్ జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ మరోసారి ట్రోఫీని సొంతం చేసుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 07.03.2026
www.mudranews.in | @mudranews



**ఏరియా 51 రహస్యం**

అమెరికాలోని ఈ సైనిక ప్రాంతంలో గోప్యమైన ప్రయోగాలు జరుగుతాయని అనేక ఊహాగానాలు ఉన్నాయి. ముఖ్యంగా UFOలపై పరిశోధనలు చేస్తున్నారనే ప్రచారం ఉంది..






## స్ఫూర్తినిచ్చేలా బైకర్ ‘జిద్దీ జిద్దీ’ సాంగ్

శర్వానంద్ హీరోగా దర్శకుడు అభిలాష్ రెడ్డి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం ‘బైకర్’. భారతదేశంలో మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో రూపొందుతున్న తొలి సినిమా కావడం దీనికి ప్రత్యేక ఆకర్షణ. ఇప్పటికే ఒక పాటను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా మరో లిరికల్ సాంగ్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది. ‘జిద్దీ జిద్దీ’ అంటూ సాగే ఈ గీతం పట్టుదల, లక్ష్యసాధన గురించి ప్రేరణనిచ్చేలా రూపొందింది. కృష్ణకాంత్ ఈ పాటకు పదాలు రాయగా, జిబ్రాన్ స్వరపరిచి స్వయంగా ఆలపించారు. ఈ సినిమాలో రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. రేసింగ్ నేపథ్యంతో సాగే ఈ చిత్రం ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## మంచు మనోజ్‌కు జోడిగా ఉక్రెయిన్ బ్యూటీ

మంచు మనోజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘డేవిడ్ రెడ్డి’. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఉక్రెయిన్ నటి మరియా ర్యాబోషాప్కా నటిస్తోంది. తాజాగా ఆమె ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో ఆమె ‘క్లారా’ అనే పాత్రలో కనిపించనుంది. “ఆమె ప్రేమ ఓ యుద్ధం” అనే ట్యాగ్‌లైన్‌తో ఈ పాత్ర కథలో కీలకంగా ఉండబోతుందని టీమ్ వెల్లడించింది. ఫస్ట్‌లుక్‌లో మరియా స్టైలిష్ లుక్‌తో కనిపిస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.ఉక్రెయిన్ సినిమాల ద్వారా నటిగా గుర్తింపు పొందిన మరియా, ‘స్పెషల్ ఓపీఎస్ 1.5’ వెబ్‌సిరీస్‌తో భారతీయ ప్రేక్షకులకు పరిచయమైంది. అనంతరం శివ కార్తికేయన్ హీరోగా తెరకెక్కిన ‘ప్రిన్స్’ సినిమాలో నటించి తెలుగు ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, తన అందం మరియు నటనతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది.దర్శకుడు మనుమరెడ్డి యక్కంటి తెరకెక్కిస్తున్న ‘డేవిడ్ రెడ్డి’ స్వాతంత్ర్యానికి ముందు కాలంలో సాగే ఫిక్షనల్ కథ. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడే ఓ యోధుడి జీవితాన్ని ప్రధానంగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో మంచు మనోజ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని చిత్రబృందం చెబుతోంది. రీ ఎంట్రీ తర్వాత మనోజ్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో కూడా మంచి ఆసక్తి నెలకొంది.అదే విధంగా ఈ సినిమా కోసం ప్రత్యేకంగా రూపొందించిన ‘వార్ డాగ్’ అనే భారీ బైక్ కూడా ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. దాదాపు 700 కిలోల బరువుతో రూపొందించిన ఈ బైక్ యాక్షన్ సన్నివేశాల్లో ప్రత్యేకంగా కనిపించబోతుందని సమాచారం. కథ, యాక్షన్ ఎలిమెంట్స్‌తో పాటు విజువల్స్ పరంగా కూడా ‘డేవిడ్ రెడ్డి’ ప్రేక్షకులకు కొత్త అనుభూతి ఇవ్వబోతుందని చిత్రబృందం భావిస్తోంది.



## మంచి కథల కోసం రిస్క్ తీసుకోవాలి: రానా

నటుడిగా మాత్రమే కాదు, నిర్మాతగా కూడా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు రానా దగ్గుబాటి. తాను నిర్మించిన సినిమాలు ప్రశంసలు అందుకోవడం గురించి ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారతీయ ప్రేక్షకులు కుటుంబ కథా చిత్రాలను ఎప్పుడూ ఆదరిస్తారని రానా అన్నారు. సంక్రాంతి సమయంలో ఎన్నో ఫ్యామిలీ డ్రామాలు విడుదలైనా ప్రేక్షకులు వాటిని ఆదరించడం దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. మంచి కథలను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతోనే తాను సినిమాలు నిర్మిస్తున్నానని చెప్పారు. ప్రయోగాత్మక కథలు తెరకెక్కించడానికి చాలా మంది సహకారం అవసరమని, ప్రస్తుతం ప్రేక్షకులు కూడా కొత్త కథలపైనే ఆసక్తి చూపుతున్నారని వివరించారు. టెక్నాలజీపై తనకు చిన్నప్పటి నుంచే ఆసక్తి ఉందని రానా తెలిపారు. నటుడిగా మారినా కూడా టెక్నాలజీ గురించి నేర్చుకోవడం ఆపలేదని చెప్పారు. ఏదైనా పని పట్ల నిజమైన ఆసక్తి ఉంటే రిస్క్ తీసుకోవాలని, ఎదురుదెబ్బలు వచ్చినా లక్ష్యం సాధించే వర కు ప్రయత్నం కొనసాగించాలన్నారు. దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ‘కాంత’ చిత్రంలో రానా నటించడమే కాకుండా నిర్మాతల్లో ఒకరిగా కూడా వ్యవహరించారు. అలాగే ఆయన సమర్పణలో వచ్చిన ‘విరాట పర్వం’, ‘గార్గి’, ‘35 చిన్న కథ కాదు’ వంటి చిత్రాలు మంచి ప్రశంసలతో పాటు అవార్డులను కూడా అందుకున్నాయి.



## జాన్వీ పేరెందుకు పెట్టారంటే

రామ్‌చరణ్‌తో రూపొందుతున్న ‘పెద్ది’ సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతోంది అందాల నటి జాన్వీ కపూర్. ఆమె పుట్టినరోజు సందర్భంగా జాన్వీ గురించి కొన్ని ఆసక్తికర విషయాలు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. అలనాటి స్టార్ హీరోయిన్ శ్రీదేవి, ప్రముఖ నిర్మాత బోనీ కపూర్‌ల కుమార్తెగా జాన్వీ సినీ రంగంలోకి ప్రవేశించింది. అయితే జాన్వీ అనే పేరు ఎలా వచ్చిందో గురించి కూడా ఓ ఆసక్తికర కథ ఉంది. శ్రీదేవి నటించిన ‘జుదాయ్’ సినిమాలో ఊర్మిళ మతోండ్కర్ పోషించిన పాత్ర పేరు జాన్వీ. ఆ పాత్ర శ్రీదేవికి ఎంతో నచ్చడంతో అదే పేరును తన కుమార్తెకు పెట్టాలని ఆమె నిర్ణయించింది. చిన్నప్పటి నుంచే సినిమాల్లో నటించాలని జాన్వీకి ఆసక్తి ఉండేది. అయితే ఆమెను డాక్టర్‌గా చూడాలని శ్రీదేవి కోరుకున్నట్లు జాన్వీ ఒక ఇంటర్వ్యూలో వెల్లడించింది. దైవభక్తి ఎక్కువగా ఉన్న జాన్వీ తరచూ తిరుమల వెళ్లి స్వామివారి దర్శనం చేసుకుంటుంది. ఫిట్‌నెస్ విషయంలో కూడా ఆమె చాలా శ్రద్ధ చూపుతుంది. వర్కౌట్స్‌తో పాటు యోగా చేయడం ఆమె రోజువారీ అలవాటు. డ్యాన్స్ అంటే జాన్వీకి ప్రత్యేకమైన ఇష్టం. కథక్ నృత్యంలో శిక్షణ తీసుకున్న ఆమె ఖాళీ సమయం దొరికితే కవితలు రాయడం, ట్రావెలింగ్ చేయడం ఇష్టపడుతుంది. ఉదయ్‌పూర్, ఫ్లోరెన్స్ నగరాలు ఆమెకు ఎంతో నచ్చిన ప్రదేశాలుగా చెబుతుంది.

## ‘వృషకర్మ’ గ్లింప్స్‌కు సుకుమార్ ప్రశంసలు..



నాగచైతన్య హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం ‘వృషకర్మ’. ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజువల్స్, కాన్సెప్ట్ ప్రత్యేకంగా ఉండటంతో సోషల్ మీడియాలో కూడా మంచి స్పందన లభిస్తోంది.ఈ గ్లింప్స్‌పై ప్రముఖ దర్శకుడు సుకుమార్ ప్రశంసలు కురిపించారు. కార్తీక్ దండు ఈ సినిమా కథను తనకు మొదటిసారి వినిపించినప్పుడు ఎంతో ఆశ్చర్యపోయానని ఆయన చెప్పారు. కథలో ఉన్న ఐడియా చాలా కొత్తగా అనిపించిందని, గ్లింప్స్‌లో కనిపించిన విజువల్స్ కూడా అద్భుతంగా ఉన్నాయని పేర్కొన్నారు. సినిమా మీద టీమ్ పెట్టిన శ్రమ స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.అలాగే ఈ ప్రాజెక్ట్‌లో నాగచైతన్య మొదటి నుంచే ఎంతో ఆసక్తిగా పాల్గొంటున్నారని సుకుమార్ తెలిపారు. కథ నుంచి నిర్మాణం వరకు ప్రతి విభాగంపై అతను ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాడని చెప్పారు. ఒక నటుడిగా మాత్రమే కాకుండా, సినిమాపై పూర్తి అవగాహనతో పనిచేస్తున్నాడని అభినందించారు.భిన్నమైన కథా నేపథ్యంతో తెరకెక్కుతున్న ‘వృషకర్మ’పై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. గ్లింప్స్‌కు వచ్చిన స్పందనతో సినిమా పట్ల ఆసక్తి మరింత పెరిగింది.

## ఆ పని ఇప్పుడు చేయలేను

### ప్రియమణి

హీరోయిన్ ప్రియమణి తన సినీ ప్రయాణాన్ని ‘ఎవరే అతగాడు’ (2003) సినిమాతో ప్రారంభించింది. అనంతరం తెలు గు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో అనేక చిత్రాల్లో నటించి స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు పొందింది. తాజాగా ‘సరస్వతి’ సినిమాతో ప్రేక్షకులను అలరించింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కెరీర్ ప్రారంభంలో జరిగిన ఓ సంఘటనను ఆమె గుర్తు చేసుకుంది. ‘ద్రోణ’ సినిమాలో స్విమ్‌సూట్ ధరించిన విషయం గురించి మాట్లాడింది.సినిమాలో ఓ సన్నివేశం కోసం దర్శకుడు స్విమ్‌సూట్ వేసుకోవాలని అడిగాడని, కొత్తగా కనిపించాలని చెప్పడంతో ఒకసారి ప్రయత్నించాలనుకుని అంగీకరించానని తెలిపింది. అయితే ఆ తర్వాత తనపై చాలా కామెంట్లు, ట్రోలింగ్ వచ్చాయని చెప్పింది. నటిగా ఉన్నప్పుడు కథ, పరిస్థితి డిమాండ్ చేస్తే కొన్ని సన్నివేశాలు చేయాల్సి వస్తుందని, కానీ తనకు కంఫర్ట్ కూడా ముఖ్యమని ప్రియమణి పేర్కొంది. ఇప్పుడు అలాంటి సన్నివేశాలు చేయమంటే మాత్రం తాను ఒప్పుకోనని స్పష్టం చేసింది.



## ‘వారణాసి’ అనుభవం మర్చిపోలేను:

### ప్రియాంక చోప్రా

మహేష్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘వారణాసి’ సినిమాపై ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఆస క్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా గురించి నటి ప్రియాంక చోప్రా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు వెల్లడించారు. గతేడాది సెప్టెంబర్‌లో కెన్యాలో జరిగిన షూటింగ్‌ను గుర్తుచేసు కుంటూ, అడవుల్లో వేలాది వైల్డ్ బీస్ట్స్ మధ్య నిలబడి షూటింగ్ చేయడం తన జీవితంలో మర్చిపోలేని అనుభవమని చెప్పారు. ఆ జంతువులను దగ్గరగా చూడటం ద్వారా ప్రకృతి శక్తి ఎంత గొప్పదో అర్థమైందని ప్రియాంక తెలిపారు. అదే అనుభూతిని దర్శకుడు రాజమౌళి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇదిలా ఉంటే, ప్రియాంక చోప్రా మరోసారి అంతర్జాతీయ వేదికపై మెరవనున్నారు. మార్చి 15న జరగనున్న ఆస్కార్ అవార్డ్స్‌లో ఆమె ప్రెజెంటర్‌గా పాల్గొననున్నారు. ఇటీవల గోల్డెన్ గ్లోబ్స్ అవార్డ్స్‌లో కూడా ఆమె ప్రెజెంటర్‌గా వ్యవహరించారు.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com